SK1 one NEWS HD

సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

RNI APTEL / 2018/76380

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 07 సంచిక : 328. | పేజీలు : 08, వెల రూ. 2 రూ/ | శనివారం 31-01-2026

## మేడారంలో మొక్కులు చెల్లించుకున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువల్ ఓరం

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను సందర్శించిన కేంద్ర మంత్రులు

గద్దెలపై నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్న ఓరం, కిషన్ రెడ్డి



గిరిజనుల మహా కుంభమేళా ఈ జాతర అని అభివర్ణించిన జువల్ ఓరం

రూ.890 కోట్లతో సమ్మక్క-సారలమ్మ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు

## చిన్నారులను సామాజిక మాధ్యమాలకు
# దూరంగా ఉంచాల్సిందే

### తరచూ ఫేక్ పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు

- కులం, మతం, ప్రాంతం అంటూ విద్వేషం చిమ్మితే కఠిన చర్యలు
- మంత్రి లోకేశ్ నేతృత్వంలో మంత్రుల బృందం సమావేశం
- మలేసియాలో మై డిజిటల్ ఐడీ, పాస్‌పోర్ట్ వివరాలతో ఈ-కేవైసీ అనుసంధానం ద్వారా 16 సంవత్సరాల పైబడిన వారికి మాత్రమే సోషల్ మీడియా యాక్సెస్ ఉంది



అమరావతి: నిర్ణీత వయసుకు లోబడిన మైనర్లను సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచే విషయమై విధివిధానాలను రూపొందించాలని మంత్రి నారా లోకేశ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. సామాజిక మాధ్యమ జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడంపై మంత్రి లోకేశ్ అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. సమాచార, పౌరసంబంధాలశాఖ మిగతా..2లో



## కేసీఆర్‌ను టచ్ చేస్తే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేసినట్టే

- సిట్ నోటీసులపై హరీశ్ రావు ఫైర్
- ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కు సిట్ నోటీసులు
- సిట్ నోటీసులు రాజకీయ కక్ష సాధింపు చర్యేనని హరీశ్ రావు ఆగ్రహం
- సింగరేణి కుంభకోణం నుంచి దృష్టి మరల్చేందుకే ప్రభుత్వ కుట్ర అని విమర్శలు

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ మిగతా..2లో

# వైభవంగా మేడారం మహా జాతర..




### భారీ సంఖ్యలో పోటెత్తిన భక్తులు

ఘనంగా ప్రారంభమైన మేడారం మహాజాతర

ఆచారాల నడుమ ఆగమనం.. ఎదురేగిన భక్తజనం..

- దారిపొడవునా భక్తుల పొర్లుదండాలు..శివసత్తుల పూనకాలు
- జయజయధ్వానాలతో ఉప్పొంగిన భక్తిపారవశ్యం
- సారలమ్మతో పాటు గద్దెలకు చేరిన పగిడిద్దరాజు, గోవిందరాజు



మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర రెండో రోజు వైభవంగా జరుగుతోంది. ఇప్పటికే భక్తుల జయజయధ్వానాల నడుమ సారలమ్మ పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి విచ్చేశారు. జాతర సందర్భంగా మేడారం భక్తులతో కిటకిటలాడుతోంది. జంపన్నవాగు పరిసరాలు జనసంద్రంగా మారాయి. మిగతా..2లో



## ఆత్మవిశ్వాస భారత్‌కు ఈయూ ఒప్పందం నిదర్శనం


ఢిల్లీ: బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడారు. భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం , "ఆశావహ, ఆత్మవిశ్వాస, మిగతా..2లో

# కేసీఆర్‌కు నోటీసులు..
# ఇది విచారణ కాదు.. ప్రతీకారం

- కక్ష సాధింపు రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నాం
- తెలంగాణను సాధించిన మహానాయకుడు కేసీఆర్
- "సాధించిన తెలంగాణను పదేళ్ల తన పాలనతో ప్రపంచానికి చాటి చెప్పిన నాయకుడు కేసీఆర్



హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇవ్వడంపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. కక్ష సాధింపు రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మిగతా..2లో



## అమ్మ పుట్టినరోజునాడు రెండు జిరాఫీలను
# దత్తత తీసుకున్నా
## జంతు సంరక్షణకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలి

విశాఖపట్నం: ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సందర్శించారు. తన తల్లి అంజనా దేవి జన్మదినం సందర్భంగా జూపార్క్‌లోని రెండు జిరాఫీలను ఏడాదిపాటు దత్తత తీసుకుంటున్నట్లు పవన్ ప్రకటించారు. రెండు జిరాఫీలకు ఏడాదిపాటు అయ్యే ఖర్చు మొత్తం భరించనున్నట్లు తెలిపారు. జంతు సంరక్షణకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. జూ పార్కులో నూతనంగా నిర్మించిన ఎలుగుబంట్ల ఎన్‌క్లోజర్‌ను పవన్ ప్రారంభించారు. జూపార్కులోని నీటి ఏనుగులు, నల్ల ఎలుగుబంట్లు, పులులు, సింహాల ఎన్‌క్లోజర్ల వద్దకు వెళ్లి వాటికి ఆహారం అందించారు. వాటి పేర్లను జూ క్యురేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏనుగులు, జిరాఫీల శాలలను పరిశీలించారు. కంబాలకొండ ఎకో పార్కులో నగరవనాన్ని ప్రారంభించారు. ఎకో పార్కులోని చెక్క వంతెనపై వాక్ చేశారు. అక్కడ పెరుగుతున్న మొక్కల వివరాలను అధికారులను అడిగి పవన్ కల్యాణ్ తెలుసుకున్నారు.

## ఆర్థిక సర్వేలో తెలుగు రాష్ట్రాల ప్రస్తావన..

- ఏపీలో ఏటా
- ద్రవ్యోల్బణం తగ్గుతూ వస్తోంది




- తెలంగాణలో సాగు యోగ్య భూ విస్తీర్ణం పెరిగినట్లు ఆర్థిక సర్వే

ఢిల్లీ: పార్లమెంట్‌లో కేంద్రం ప్రవేశపెట్టిన ఆర్థికసర్వేలో తెలుగు రాష్ట్రాల్లోని అభివృద్ధి అంశాలను ప్రస్తావించారు. ఏపీ, తెలంగాణకు చెందిన పలు విషయాలను పేర్కొంది. ఏపీలో ఏటా ద్రవ్యోల్బణం తగ్గుతూ వస్తోందని తెలిపింది. మిగతా..2లో

## ఎన్నికల నేపథ్యంలోనే కేసీఆర్‌కు నోటీసులు: కవిత

### ఎన్నికలు జరుగుతున్నాయనే కేసీఆర్‌కు సిట్ నోటీసుల్చింది

- ఫోన్ ట్యాపింగ్ బాధాకరమన్న ఆమె.. సిట్ విచారణ సీరియస్‌గా జరగట్లేదు
- ఈ కేసులో విచారణ ఎక్కడో ఒక దగ్గర పూర్తికావాలి



ఎన్నికలు జరుగుతున్నాయనే కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ బాధాకరమన్న ఆమె.. సిట్ విచారణ సీరియస్‌గా జరగట్లేదని ఆక్షేపించారు. ఈ కేసులో విచారణ ఎక్కడో ఒక దగ్గర పూర్తికావాలని మిగతా..2లో

# జగన్‌కు అధికారం సూట్ కాలేదు

- 2027లో జగన్ పాదయాత్ర చేస్తుండడంపై షర్మిల స్పందన
- ఈ యాత్ర ప్రజల కోసం కాదు అధికారం కోసమేనన్న ఏపీ కాంగ్రెస్ చీఫ్
- జగన్‌లో స్వార్థం తగ్గి, ప్రజలకు సేవ చేసే గుణం పెరగాలని హితవు
- అప్పటివరకు దేవుడు కరుణించడని వ్యాఖ్యలు



అమరావతి: ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన సోదరుడు, వైసీపీ అధినేత జగన్ పై మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "జగన్‌కు అధికారం సూట్ కాలేదు" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారం చేతిలో ఉన్నప్పుడు ఆయన అసలు నైజం బయటపడిందని, మిగతా..2లో

## కేసీఆర్ కు నోటీసులు అందించిన సిట్.. నేడు విచారణ



- నంది నగర్ లోని నివాసంలో నోటీసులు అందించిన సిట్
- విచారణకు పీఎస్ కు రావాల్సిన అవసరం లేదన్న సిట్ అధికారులు

సీమకిరణం
నంద్యాల
కర్నూలు
తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



# యూజీసీ 2026 నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే

ఢిల్లీ: ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ ప్రోత్సాహం కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తీసుకొచ్చిన 2026 నిబంధనల అమలుపై సుప్రీంకోర్టు ఇవాళ మధ్యంతర స్టే విధించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు 2012 నాటి పాత నిబంధనలే అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వానికి, యూజీసీకి నోటీసులు జారీ చేసింది. యూజీసీ కొత్త నిబంధనలు జనరల్ కేటగిరీ విద్యార్థుల పట్ల వివక్ష చూపించేలా ఉన్నాయని, వారికి ఫిర్యాదు చేసే యంత్రాంగాన్ని నిరాకరిస్తున్నాయని ఆరోపిస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. "మేము జోక్యం చేసుకోకపోతే, ఇది ప్రమాదకరమైన ప్రభావాన్ని చూపుతుంది. సమాజాన్ని విభజిస్తుంది, తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది" అని ధర్మాసనం ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం 'కుల ఆధారిత వివక్ష' అనే పదాన్ని కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకే పరిమితం చేశారని పిటిషనర్లు ఆరోపించారు. దీనివల్ల జనరల్ కేటగిరీకి చెందిన వారికి ఎలాంటి వివక్ష ఎదురైనా ఫిర్యాదు చేసే అవకాశం లేకుండా పోతుందని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15(1), 21లను ఉల్లంఘించడమేనని వాదించారు. పిటిషనర్ల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, 'సంపూర్ణ న్యాయం' కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తమకున్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించి ఈ నిబంధనలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. అనంతరం తదుపరి విచారణను మార్చి 19వ తేదీకి వాయిదా వేసింది.

# రాహుల్ గాంధీ, ఖర్గేలతో సమావేశమైన శశిథరూర్

ఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో ఆ పార్టీ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రధాని మోదీని ప్రశంసిస్తూ శశిథరూర్ పలుమార్లు స్పందించారు. దీంతో, కాంగ్రెస్ తో ఆయన సంబంధాలు మరింత బలహీనపడ్డాయి. ఆయన బీజేపీలో చేరబోతున్నారనే ప్రచారం కూడా ఇటీవలి కాలంలో ఎక్కువైంది. మరోవైపు పార్టీ కీలక సమావేశాలకు కూడా థరూర్ వరుసగా గైర్హాజరు అవుతుండటంతో... ఈ ప్రచారానికి రెక్కలొచ్చినట్టయింది. ఈ క్రమంలో ఆసక్తకర పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో శశిథరూర్ భేటీ అయ్యారు. పార్లమెంటు ప్రాంగణంలో దాదాపు 30 నిమిషాల పాటు వీరి సమావేశం కొనసాగింది. డ్యామేజ్ కంట్రోల్ లో భాగంగా ఈ సమావేశం జరిగినట్టు తెలుస్తోంది. తనవైపు నుంచి వివరణ ఇచ్చేందుకు కాంగ్రెస్ హైకమాండ్ తో సమావేశానికి థరూర్ సమయం కోరినట్టు చెబుతున్నారు. ఈ క్రమంలోనే వీరి సమావేశం చోటుచేసుకుంది.

## మౌలిక సదుపాయాల్లో దూసుకెళుతున్న భారత్..
# ఆర్థిక సర్వే 2026లో కీలక విషయాలు

ఢిల్లీ: భారతదేశ వృద్ధి వ్యూహంలో మౌలిక సదుపాయాల రంగం కేంద్ర స్థానంలో ఉందని, ఈ రంగంలో ప్రభుత్వ మూలధన వ్యయం స్థిరంగా పెరుగుతోందని ఆర్థిక సర్వే 2025-26 స్పష్టం చేసింది. ఇవాళ విడుదల చేసిన ఈ సర్వే ప్రకారం, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామి దేశాల్లో ఒకటిగా నిలిచింది. తక్కువ, మధ్య ఆదాయ ఆర్థిక వ్యవస్థలలో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రైవేట్ పెట్టుబడుల విషయంలో ప్రపంచ బ్యాంకు ర్యాంకింగ్స్‌లో భారత్ టాప్-5 దేశాల్లో ఒకటిగా నిలిచింది. పీఎం గతిశక్తి, జాతీయ లాజిస్టిక్స్ పాలసీ వంటివి ఈ వృద్ధికి దోహదపడ్డాయని సర్వే పేర్కొంది. దీనివల్ల లావాదేవీల ఖర్చులు, ప్రాజెక్టుల అమలులో రిస్కులు తగ్గాయి. ప్రభుత్వ మూలధన వ్యయం ఎఫ్‌వై18లో రూ. 2.63 లక్షల కోట్ల నుంచి ఎఫ్‌వై26 నాటికి రూ. 11.21 లక్షల కోట్లకు, అంటే దాదాపు 4.2 రెట్లు పెరిగింది. జాతీయ రహదారుల నెట్‌వర్క్ 2014లో 91,287 కిలోమీటర్ల నుంచి 2026 డిసెంబర్ నాటికి 1,46,572 కిలోమీటర్లకు విస్తరించింది. విమానయాన రంగంలో విమానాశ్రయాల సంఖ్య 2014లో 74 నుంచి 2025 నాటికి 164కు పెరిగింది. రైల్వే నెట్‌వర్క్‌లో 99.1 శాతం విద్యుదీకరణ పూర్తయింది. 'మారిటైమ్ ఇండియా విజన్' వంటి పథకాలతో భారత పోర్టుల పనితీరు మెరుగుపడి, 7 పోర్టులు ప్రపంచ బ్యాంకు టాప్ 100 జాబితాలో స్థానం దక్కించుకున్నాయి. విద్యుత్ రంగంలోనూ భారీ విస్తరణ జరిగింది. మొత్తం స్థాపిత సామర్థ్యం 509.74 గిగావాట్లకు చేరగా, ఇందులో పునరుత్పాదక ఇంధన వాటా దాదాపు 49.83 శాతంగా ఉంది. గత దశాబ్ద కాలంలో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం మూడు రెట్లకు పైగా పెరిగి 253.96 గిగావాట్లకు చేరుకుందని సర్వే తెలిపింది. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది.

# కేసీఆర్ కు నోటీసులు అందించిన సిట్.. నేడు విచారణ

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు నోటీసులు అందాయి. హైదరాబాద్ లోని నందినగర్ లో ఉన్న కేసీఆర్ నివాసానికి వెళ్లిన సిట్ అధికారులు నోటీసులు అందించారు. నేడు మధ్యాహ్నం 3 గంటలకు విచారణ జరుపుతామని నోటీసుల్లో సిట్ అధికారులు పేర్కొన్నారు. కేసీఆర్ వయసు దృష్ట్యా విచారణ కోసం పోలీస్ స్టేషన్ కు రావాల్సిన అవసరం లేదని సిట్ తెలిపింది. హైదరాబాద్ నగర పరిధిలోని ఏదైనా ప్రాంతం వివరాలను తెలిపితే... అక్కడకే వచ్చి విచారణ జరుపుతామని పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, హరీశ్ రావు, సంతోష్ కుమార్ లను సిట్ విచారించింది. మళ్లీ అవసరమైతే విచారణకు పిలుస్తామని వారికి తెలియజేసింది. ఇప్పుడు గులాబీ బాస్ ను విచారణకు పిలవడంతో ఆ పార్టీలో ఉత్కంఠ నెలకొంది. రాబోయే రోజుల్లో ఈ కేసులో మరెన్ని మలుపులు చోటుచేసుకుంటాయో అనే ఆసక్తి సర్వత్ర నెలకొంది.

## కొలంబియాలో ఘోర విమాన ప్రమాదం..
# ప్రముఖ నేత సహా 15 మంది మృతి

ఢిల్లీ: కొలంబియాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. దేశ ఈశాన్య ప్రాంతంలోని నార్టే డి సెంటాండర్ ప్రావిన్స్‌లో ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ సటేనాకు చెందిన ఒక చిన్న విమానం బుధవారం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న ఇద్దరు సిబ్బంది, 13 మంది ప్రయాణికులతో సహా మొత్తం 15 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ప్రముఖ రాజకీయ నాయకుడు, మానవ హక్కుల కార్యకర్త డియోజెనెస్ క్వింటెరో కూడా ఉండటంతో దేశవ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎన్‌4709 రిజిస్ట్రేషన్ నంబర్ గల ఈ విమానం, స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 11:42 గంటలకు కుకుటా విమానాశ్రయం నుంచి ఒకానాకు బయలుదేరింది. 40 నిమిషాల ఈ ప్రయాణం ప్రారంభమైన కొద్దిసేపటికే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో విమానానికి సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. అప్రమత్తమైన అధికారులు కురాసికా అనే మారుమూల గ్రామీణ ప్రాంతంలో విమానం కూలిపోయినట్లు గుర్తించారు. వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. విమానం ఉన్న ప్రదేశాన్ని గుర్తించిన తర్వాత అందులో ఎవరూ ప్రాణాలతో మిగిలిలేరని అధికారులు ధ్రువీకరించినట్లు కొలంబియా రవాణా మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ విషాద ఘటనపై కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ఈ మరణాలు నన్ను తీవ్రంగా కలచివేశాయి. వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం అధికారులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# ఆత్మవిశ్వాస భారత్‌కు ఈయూ ఒప్పందం నిదర్శనం

మొదటి పేజీ తరువాయి

"ఆశావహ, ఆత్మవిశ్వాస, ఆత్మనిర్భర్ భారత్" స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు. 21వ శతాబ్దపు ఈ త్రైమాసికంలో భారతదేశం ప్రపంచానికి ఒక ఆశాకిరణంగా, ఆకర్షణ కేంద్రంగా మారిందని పేర్కొన్నారు. దేశ ఆర్థిక, ప్రజాస్వామ్య బలంపై ప్రపంచానికి పెరుగుతున్న విశ్వాసానికి ఇదే నిదర్శనమని తెలిపారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ద్వారా భారతదేశానికి, ముఖ్యంగా యువతకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. "భారత్, యూరప్ మధ్య ఈ చారిత్రాత్మక ఒప్పందం కుదిరినప్పుడు మన పారిశ్రామికవేత్తలు, తయారీదారులు కేవలం [illegible] చాటుకోవాల్సిన గొప్ప అవకాశం. ఇప్పుడు మార్కెట్ మన కోసం తెరుచుకుంది. అత్యుత్తమ నాణ్యతతో యూరప్‌లోని 27 దేశాల హృదయాలను మనం గెలుచుకోవాలి. ఇది దీర్ఘకాలంలో మనకు ఎంతో మేలు చేస్తుంది" అని ప్రధాని వివరించారు. ఈ ఒప్పందం ద్వారా భారత రైతులు, యువత, సేవా రంగంలోని నిపుణులకు ప్రపంచ మార్కెట్లలో గణనీయమైన అవకాశాలు లభిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

### వికసిత్ భారత్ లక్ష్య సాధనలో బడ్జెట్ సమావేశాలు కీలకం: ప్రధాని

2047 నాటికి 'వికసిత్ భారత్' సాధించాలనే సంకల్పంలో ఈ బడ్జెట్ సమావేశాలు ఒక ముఖ్యమైన అడుగు అని ప్రధాని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్'పై వేగంగా ముందుకు సాగుతోందని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతోందని తెలిపారు. తమ ప్రభుత్వ పనితీరు "సంస్కరణ, పనితీరు, పరివర్తన" అనే సూత్రంపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. టెక్నాలజీని అందిపుచ్చుకుంటూనే, మానవతా దృక్పథాన్ని విస్మరించబోమని, చిట్టచివరి వ్యక్తి వరకు లబ్ధి చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు.

### వరుసగా 9వ బడ్జెట్.. నిర్మలా సీతారామన్‌పై మోదీ ప్రశంసలు

అలాగే, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టడం దేశ పార్లమెంటరీ చరిత్రలో ఒక గర్వకారణమైన క్షణమని అభివర్ణించారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటులో చేసిన ప్రసంగం 140 కోట్ల మంది భారతీయుల ఆత్మవిశ్వాసాన్ని, ఆకాంక్షలను ప్రతిబింబించిందని కొనియాడారు. దేశాభివృద్ధిని వేగవంతం చేసేందుకు ఎంపీలందరూ నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలని ప్రధాని కోరారు.

## వైభవంగా మేడారం మహా జాతర..
# భారీ సంఖ్యలో పోటెత్తిన భక్తులు

మేడారం: కోట్లాది భక్తుల కొంగుబంగారం.. కోరిన కోర్కెలు తీర్చే వన దేవతలు..సబ్బండ జనాల ఆరాధ్యదైవాలు..సమ్మక్కసారలమ్మల మహాజాతర అంగరంగవైభవంగా ప్రారంభమైంది. అశేష భక్తజన సందోహం నడుమ ములుగు జిల్లా మేడారంలో జయజయధ్వానాల భక్తినినాద హోరులో ఆధ్మాత్మిక ఘనసంరంభం మొదలైంది. సారలమ్మ ఆగమనం క్షణక్షణం అత్యంత ఉద్విగ్నభరితంగా సాగింది. భక్తుల పొర్లుదండాలు..శివసత్తుల పూనకాలు..కొమ్ము, బూర, డోలు వాయిద్యాల మధ్య సారలమ్మ తల్లి గద్దెను చేరడంతో భక్తజనం పులకించిపోయారు. కన్నెపల్లిలోని సారలమ్మ గుడి వద్ద ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం పూజారులు సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడి నుంచి మొంటె (వెదురు బుట్ట)లో అమ్మవారి ప్రతిరూపమైన పసుపు, కుంకుమలు తీసుకుని మేడారానికి బయలుదేరారు. జంపన్నవాగులో నీటితో కాళ్లు కడుక్కుని అక్కడి నుంచి సమ్మక్క గుడికి చేరుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న పగిడిద్దరాజు, గోవిందరాజులతో కలిసి పూజారులు ముగ్గురి రూపాలను రాత్రి మేడారం గద్దెలపై చేర్చారు. కన్నెపల్లి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలోని మేడారం గద్దెల వద్దకు సారలమ్మ వస్తున్న వేడుకను చూసేందుకు లక్షలాది మంది భక్తులు పోటీపడ్డారు. కోరిన కోరికలు నెరవేర్చే వనదేవత సారలమ్మ మేడారం గద్దెపై కొలువుదీరారు. పగిడిద్దరాజు, గోవిందరాజులు సారలమ్మతోనే గద్దెలపైకి చేరారు. జాతర తొలిరోజు ఆచారాల ప్రకారం కన్నెపల్లి నుంచి సారలమ్మ దేవత గద్దెపైకి రాకతో మహాజాతర అంకురార్పణ జరిగింది.

ఆచారాల నడుమ ఆగమనం.. ఎదురేగిన భక్తజనం..

ఆదివాసీ ఆచార సంప్రదాయాల ప్రకారం సారలమ్మ యేతేంచగా... అడుగడుగునా అశేషంగా తరలివచ్చిన భక్తజనం ఎదురేగారు. ఉదయం 11:00 నుంచి 12:00 గంటల మధ్య సమ్మక్క, సారలమ్మ పూజారులు గద్దెల వద్దకు చేరుకుని పుట్టమన్నుతో గద్దెలను అలికి శుద్ధి చేశారు. గొట్టు గోత్రాల ప్రకారం, ఆదివాసీ సంప్రదాయ పద్ధతుల్లో పీఠ ముగ్గులు వేసి అమ్మవార్లకు పసుపు, కుంకుమ, చీర సారెలను సమర్పించి ధూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 5.45 గంటల సమయంలో సోలం వెంకటేశ్వర్లు పట్టిన హనుమాన్ జెండా నీడలో కన్నెపల్లి వెన్నెలమ్మగా పేరున్న సారలమ్మ మేడారంలోని సమ్మక్క గుడికి బయలుదేరారు. అప్పటికే అక్కడికి చేరుకున్న గోవిందరాజు, పగిడిద్దరాజులు సారలమ్మతో కలిసి గుడికి వెళ్లారు. సారలమ్మ పూజారులు గుడిలో సారలమ్మ పీఠం పసుపు కుంకుమలతో అలంకరించి పూజలు నిర్వహించారు. సమ్మక్క పూజారులు కూడా కట్టడి పూజలు చేశారు. అనంతరం మాఘ శుద్ధ పౌర్ణమి వెన్నెలలో సమ్మక్క అమ్మవారు, పగిడిద్దరాజులకు ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం కల్యాణ మహోత్సవం నిర్వహించారు. తదనంతరం తల్లి అనుమతి తీసుకున్న సారలమ్మతో పాటు గద్దెలకు చేరిన గోవిందరాజు, పగిడిద్దరాజులను పూజారులు గద్దెలపై ప్రతిష్టించారు. ఈ సమయంలో దేవాదాయశాఖ అధికారులు పూజా కార్యక్రమాల సమయంలో విద్యుత్ దీపాలను ఆర్పివేయడంతో పూజారులు పూజా, ప్రతిష్ట క్రతువును పూర్తి చేశారు.

వరంబట్టిన మహిళలు.. కన్నెపల్లి నుంచి హనుమంతుడి రక్షా కవచం (నీడ)లో సారలమ్మ దేవత బయలుదేరి, రాత్రి మేడారం గద్దెలకు చేరుకున్నారు. కాగా సారలమ్మ గద్దె పైకి వస్తున్న సమయంలో ఎదురెళ్లి వరం పడితే సంతానభాగ్యం కలుగుతుందని, కోర్కెలు నెరవేరతాయని మహిళల నమ్మకం. ఈ సందర్భంగా సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య అమ్మవారి ప్రతిమను మొంటెలో తీసుకొస్తుండగా ఆలయం మెట్ల నుంచి వంద మీటర్ల పొడవునా భక్తులు కింద పడుకుని వరం పట్టారు. కాగా, సారలమ్మను తీసుకొస్తున్న పూజారులు వీరిపై దాటివెళ్లారు. సారలమ్మ గద్దెలకు రాకను సూచిస్తూ ఆదివాసీ పూజారులు కొమ్ముబూరలు ఊదారు. ప్రత్యేక డోలు వాయి ద్యాలు, శివసత్తుల పూనకాలు, హిజ్రాల శివాలుతో కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయం భక్తిభావంతో ఉప్పొంగింది. కాగా ప్రభుత్వం తరఫున రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్క, ములుగు కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

నృత్యం చేసిన మంత్రులు.. రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్క, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కన్నెపల్లి నుంచి మేడారం గద్దెల వరకు ఆద్యంతం ఊరేగింపులో పాల్గొన్నారు. మేడారం గద్దెల వద్ద మంత్రులు, అధికారులు కలిసి నృత్యం చేశారు. కాగా, రాత్రి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అమ్మ వారిని దర్శించుకున్నారు.

# ఆర్థిక సర్వేలో తెలుగు రాష్ట్రాల ప్రస్తావన..

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో సాగు యోగ్య భూ విస్తీర్ణం పెరిగినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల సాగు విస్తీర్ణం మెరుగుపడినట్లు పేర్కొంది.

ఏపీలో ఇలా.. ఏపీలో ద్రవ్యోల్బణం 2022-23లో 7.57 శాతం ఉంటే.. 2025-26 నాటికి 1.39 శాతానికి తగ్గిందని ఆర్థిక సర్వే వెల్లడించింది. తెలంగాణలో 8.61 శాతం నుంచి 0.20 శాతానికి దిగిందని పేర్కొంది. తెలుగు రాష్ట్రాల్లో జాతీయ సగటు ద్రవ్యోల్బణం 1.72 శాతం కంటే.. తక్కువగా నమోదైందని తెలిపింది. అకాల వర్షాలు, ప్రకృతి ప్రకోపాల కారణంగా వ్యవసాయ దిగుబడి తగ్గుతోందని పేర్కొంది. కొత్త నగరాల విస్తరణ, అభివృద్ధి వ్యవహారాల్లో ఏపీ రాజధాని అమరావతి గురించి ప్రస్తావించింది. అమరావతి హరిత నగర నిర్మాణాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. నగర నిర్మాణంలో అరుదైన అవకాశాలు అమరావతికి లభించాయని తెలిపింది. వాణిజ్య సంస్కరణల కార్యాచరణలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని.. దీని కారణంగా రాష్ట్రంలో వ్యాపార వాతావరణం మెరుగుపడుతోందని తెలిపింది. సింగిల్ విండో ద్వారా పారిశ్రామిక అనుమతులు మంజూరు చేయడాన్ని ఈ సందర్భంగా ఆర్థిక సర్వే పేర్కొంది. రాష్ట్రంలో 6,900 గ్రామాల్లో 81 లక్షల భూకమతాల రీ సర్వే, 86 వేల సరిహద్దు వివాదాలు పరిష్కారం అయ్యాయని తెలిపింది. ఏపీలో ప్రపంచ స్థాయి బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. పంజాబ్, ఏపీ, గుజరాత్‌కు విదేశీ విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని సర్వే వెల్లడించింది. దేశంలో జీవనయోగ్య నగరాల్లో టాప్ 10లో విజయవాడ, తిరుపతి నిలిచాయి.

తెలంగాణలో.. తెలంగాణలో సాగు యోగ్య భూ విస్తీర్ణం 2014-23 మధ్య 1.31 కోట్ల ఎకరాలు ఉందని.. అది 2.21 కోట్లకు పెరిగినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. తయారీ రంగంలో తెలంగాణ 5 శాతం వాటా నమోదు చేసినట్లు పేర్కొంది. ఏఐ స్టార్టప్‌ల్లో తెలంగాణ వాటా 7 శాతం కాగా.. 30 శాతంతో కర్ణాటక అగ్రస్థానంలో నిలిచింది. ఐటీ, ఫైనాన్స్, ప్రొఫెషనల్ సర్వీసుల్లో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల వాటా 40 శాతంగా ఉంది. భూభారతి పోర్టల్ ద్వారా.. రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల విభాగాలను తెలంగాణ ఏకీకృతం చేసినట్లు తెలిపింది. అత్యధిక పట్టణ జనాభాలో ముంబయి, దిల్లీ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ ఉన్నట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ నాలుగో స్థానం, విజయవాడ 10వ స్థానంలో నిలిచాయి. 2035 నాటికి హైదరాబాద్ జీడీపీ 201.4 బిలియన్ డాలర్లు, విజయవాడ 21.3 బిలియన్ డాలర్ల స్థాయికి పెరిగే అవకాశం ఉందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. మున్సిపల్ బాండ్స్ జారీలో భాగ్యనగరం అగ్రస్థానంలో నిలిచింది.

# కేసీఆర్‌ను టచ్ చేస్తే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేసినట్టే

మొదటి పేజీ తరువాయి

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న రాజకీయ కక్ష సాధింపు చర్యేనని, ఈ కుతంత్రాలను తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. కేసీఆర్ తెలంగాణ జాతి పిత అని, కోట్లాది మంది ప్రజల ఆరాధ్య దైవమని, అలాంటి నాయకుడిపై బురద చల్లాలని చూడటం సూర్యుడిపై ఉమ్మి వేయడమేనని వ్యాఖ్యానించారు. పాలనలో తమ చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ముఖ్యంగా సింగరేణి బొగ్గు కుంభకోణం మరకల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే సిట్ పేరుతో నోటీసుల డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న చిల్లర, చౌకబారు రాజకీయాలకు పరాకాష్ఠ అని దుయ్యబట్టారు. ఇలాంటి రాజకీయ వేధింపులతో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూడటం రేవంత్ రెడ్డి రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, దశాబ్ద కాలంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మహానేత కేసీఆర్ అని హరీశ్ రావు కొనియాడారు. కేసీఆర్ చరిత్రను సృష్టిస్తే, ఆ చరిత్రను మలినం చేసేందుకు రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని, అహంకారం అంతకంటే కాదని గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణ సమాజం మొత్తం కేసీఆర్ వెంటే ఉందని, ప్రభుత్వ రాజకీయ వేధింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హరీశ్ రావు హెచ్చరించారు.

# జగన్‌కు అధికారం సూట్ కాలేదు: షర్మిల

అధికారం చేతిలో ఉన్నప్పుడు ఆయన అసలు నైజం బయటపడిందని, ఆయన తన స్వభావం మార్చుకోవాలని హితవు పలికారు. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని 2027లో జగన్ చేపట్టనున్న పాదయాత్రపై ఆమె తీవ్రంగా స్పందించారు. విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. "ఒక మనిషి నిజమైన నైజం తెలియాలంటే అతడికి అధికారం ఇచ్చి చూడాలని అబ్రహం లింకన్ అన్నారు. మనం జగన్‌కు అధికారం ఇచ్చి చూశాం. అతడి పనితీరు ఎలా ఉందో గమనించాం. జగన్‌కు అధికారం సూట్ కాలేదని అర్థమైంది" అని షర్మిల అన్నారు. జగన్‌లో స్వార్థం తగ్గి, ప్రజలకు సేవ చేసే గుణం పెరగాలని, అప్పటివరకు దేవుడు కరుణించడని, ప్రజలు కూడా ఆదరించరని ఆమె వ్యాఖ్యానించారు. 2027 జూలైలో చేపట్టే పాదయాత్ర గురించి ఇప్పుడే ఎందుకు ప్రకటించాలని షర్మిల ప్రశ్నించారు. "ఆ యాత్ర కేవలం అధికారం కోసమే తప్ప ప్రజల కోసం కాదు. మేం ఇప్పుడు ఉపాధి హామీ కూలీల కోసం యాత్ర చేస్తున్నాం. జగన్ ఎవరి కోసం, ఏ ప్రయోజనం కోసం యాత్ర చేస్తున్నారో చెప్పాలి" అని నిలదీశారు. గత ఐదేళ్ల పాలనలో జగన్ ప్రజలకు చేసిందేమిటని షర్మిల ప్రశ్నించారు. "మద్యపాన నిషేధం హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక నకిలీ మద్యంతో ఏరులై పారించి వేల కోట్లు సంపాదించారు. వేల ఏళ్ల నాటి రుషికొండను బోడిగుండు చేశారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజల మధ్యకు ఎప్పుడైనా వచ్చారా? కనీసం సొంత పార్టీ నాయకులకైనా అపాయింట్‌మెంట్ ఇచ్చారా? కేవలం ఎన్నికలకు ముందు 'సిద్ధం' సభల పేరుతో హడావుడి చేశారు" అని తీవ్రంగా విమర్శించారు. వైఎస్సార్ ప్రారంభించిన జలయజ్ఞం ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని, ఇచ్చిన హామీలను ఎందుకు పట్టించుకోలేదని ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. జగన్ మళ్లీ గెలవాలంటే ఆయన తన ప్రవర్తన, నైజం మార్చుకోవడమే ఏకైక మార్గమని షర్మిల స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో హైడ్రా కొరడా

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో అగ్నిమాపక భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఉక్కుపాదం మోపింది. ఇటీవల నాంపల్లిలో జరిగిన ఘోర అగ్నిప్రమాదం నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేసిన అధికారులు.. జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ వస్త్ర దుకాణం 'నీరూస్' తో పాటు నాంపల్లిలోని మరో ఫర్నిచర్ షోరూంను సీజ్ చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో హైడ్రా, జీహెచ్ఎంసీ, ఫైర్, విద్యుత్ శాఖల అధికారులు సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లోని నీరూస్ షోరూంలో తనిఖీ చేయగా తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడ్డాయి. మూడు సెల్లార్లు, నాలుగు అంతస్తులతో పాటు, అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన రూఫ్ షెడ్‌లో కూడా భారీగా వస్త్రాలను నిల్వ ఉంచడాన్ని అధికారులు గుర్తించారు. ఫైర్ సేఫ్టీ ఎన్వోసీ లేకపోవడం, మంటలను ఆర్పే పరికరాలు సరిగా లేకపోవడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనం పై అంతస్తులను గోదాముగా, వస్త్రాల తయారీ కేంద్రంగా మార్చడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. వెంటనే షోరూంను సీజ్ చేయాలని ఆదేశించారు. అనంతరం అధికారులు నాంపల్లి స్టేషన్ రోడ్డులోని రహీమ్, మన్నన్ ఎస్టేట్స్ స్టాండర్డ్ ఫర్నిచర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఇటీవల ఐదుగురి మృతికి కారణమైన ప్రమాదం జరిగిన రోడ్డులోనే ఉన్నప్పటికీ ఈ షోరూంలో ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకపోవడాన్ని కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. ఆరు అంతస్తుల భవనంలో మెట్ల మార్గాన్ని కూడా మూసివేసి ఫర్నిచర్ నిల్వ ఉంచడం, కనీసం ఫైర్ ఎక్స్టింగ్విషర్లు కూడా లేకపోవడంతో ఈ షోరూంను కూడా సీజ్ చేయాలని ఆదేశించారు. ఈ రెండు షోరూంల వద్ద 'ఫైర్ అన్ సేఫ్' బోర్డులను ఏర్పాటు చేసి, హైడ్రా ఫెన్సింగ్ వేశారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. నగరంలో ఎక్కడైనా ఫైర్ సేఫ్టీ నిబంధనలను ఉల్లంఘిస్తే, తమ దృష్టికి తీసుకురావాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రజలను కోరారు. హైడ్రా కంట్రోల్ రూమ్ నంబర్ 9000113667 లేదా తన వాట్సాప్ నంబర్ 7207923085కు ఫొటోలు, వీడియోలతో సహా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

## మేడారంలో కేంద్రమంత్రుల పూజలు..
# రాష్ట్ర మంత్రుల వినతి ఇదే..

మేడారం: మేడారం మహాజాతరలో నేడు కీలక ఘట్టం చోటు చేసుకోనుంది. సమక్క నేడు వనం నుండి జనం మధ్యకు రానుంది. తల్లి రాక సందర్భంగా నిర్వహించే పూజా కార్యక్రమాలు మరికొద్దిసేపట్లో ప్రారంభం కానున్నాయి. మరోవైపు.. మేడారానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కేంద్రమంత్రులు కూడా మేడారం జాతరలో పాల్గొన్నారు. మేడారం మహా జాతరలో కేంద్ర మంత్రులు జుయల్ ఓరమ్, కిషన్ రెడ్డి, బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సారలమ్మని దర్శించుకుని నిలువెత్తు బంగారం సమర్పించారు. మరోవైపు.. రాష్ట్ర మంత్రులు రాష్ట్ర మంత్రులు పొంగులేటి, సీతక్క, లక్ష్మణ్ కూడా మేడారంలో అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర మంత్రులు జుయల్ ఓరమ్, కిషన్ రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు వినతిపత్రం సమర్పించారు. ఇదిలాఉండగా.. మేడారం జాతరలో అతి ముఖ్యమైన ఘట్టం ఈరోజు ఆవిష్కృతం కానుంది.. చిలకలగుట్ట నుంచి సమ్మక్కను గద్దెలపైకి తీసుకొచ్చి ప్రతిష్టిస్తారు. ఆదివాసీ ఆచార సాంప్రదాయాల ప్రకారం చిలకలగుట్టపై పూజలు నిర్వహించి అక్కడినుండి గద్దెల పైకి తీసుకొచ్చి ప్రతిష్టిస్తారు. సారలమ్మను కాక వంశీయుల చేతుల మీదుగా తీసుకురాగా.. సమ్మక్కను సిద్దబోయిన వంశీయుల చేతుల మీదుగా గద్దెల పైకి తీసుకొస్తారని తెలిసిందే. ఈ కార్యక్రమంలో చందా వంశీయులు, ఐదు వంశస్తులు, మేడారం గ్రామస్తులతో పాటు ఆదివాసీలు అంతా పాల్గొని డోలి వాయిద్యాలు, ఆదివాసి ఆచార సంప్రదాయాలతో సమ్మక్కను ఉత్సాహంగా, ఊరేగింపుగా తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్టిస్తారు. సమ్మక్క రాక సందర్భంగా ములుగు జిల్లా ఎస్పీ 10 రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపి అధికారిక లాంచనాలతో స్వాగతం పలకడం ఇక్కడ ఆనవాయితీ. జిల్లా కలెక్టర్ ఎదురెల్లి సమ్మక్క పూజారులకు పట్టు వస్త్రాలు సమర్పించి వారికి స్వాగతం పలుకుతారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున జిల్లా డిప్యూటీ సీఎం భట్టి మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ పూజారులకు స్వాగతం పలుకుతారు. సమ్మక్క ఆగమనం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. స్థానిక మంత్రి సీతక్క అన్నీ తానై జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

# కేసీఆర్‌కు నోటీసులు.. ఇది విచారణ కాదు.. ప్రతీకారం

మొదటి పేజీ తరువాయి

కక్ష సాధింపు రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇది విచారణ కాదని, ప్రతీకారమని, రాజకీయ దురుద్దేశమని విమర్శించారు. సుదీర్ఘ ఉద్యమం చేసి తెలంగాణను సాధించిన మహానాయకుడు కేసీఆర్ అని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "సాధించిన తెలంగాణను పదేళ్ల తన పాలనతో ప్రపంచానికి చాటి చెప్పిన నాయకుడు కేసీఆర్. వివిధ పథకాలతో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప విజనరీ. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం.. అడ్డగోలు హామీలు ఇచ్చి, అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చి.. ఏడాదిలోనే ప్రజల నోట్లో మట్టి కొట్టి, ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైంది. వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు.. ఇప్పుడు విచారణల పేరుతో కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమైన కక్షసాధింపు రాజకీయానికి నిదర్శనం. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు. నోటీసులతో, బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరిపేయలేరు. తెలంగాణ ఉద్యమాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల గొంతుకగా ఈ అన్యాయ పాలనపై పోరాటం కొనసాగిస్తాం"అని కేటీఆర్ తెలిపారు.

# ఎన్నికల నేపథ్యంలోనే కేసీఆర్‌కు నోటీసులు: కవిత

మొదటి పేజీ తరువాయి

ఎన్నికలు జరుగుతున్నాయనే కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ బాధాకరమన్న ఆమె.. సిట్ విచారణ సీరియస్‌గా జరగట్లేదని ఆక్షేపించారు. ఈ కేసులో విచారణ ఎక్కడో ఒక దగ్గర పూర్తికావాలని పేర్కొన్నారు. విచారణను పూర్తి చేసే ఉద్దేశం ఉందా లేదా అనేది ఎవరికీ అర్థం కావడంలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ నేరస్థులకు శిక్షపడాల్సిందేనని స్పష్టం చేశారు.

## మేడారంలో మొక్కులు చెల్లించుకున్న
# కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువల్ ఓరం

మొదటి పేజీ తరువాయి

కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరం, బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రవేశ ద్వారం వద్ద వారికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్ సాదర స్వాగతం పలికారు. గిరిజన డప్పు వాయిద్యాల మధ్య ఆలయంలోకి ప్రవేశించిన కేంద్ర మంత్రులు, గద్దెలపై 'నిలువెత్తు బంగారం' సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం జువల్ ఓరం మీడియాతో మాట్లాడుతూ, సమ్మక్క - సారలమ్మ జాతర గిరిజనుల మహా కుంభమేళా అని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు, 20 ఏళ్ల తర్వాత మళ్లీ ఇక్కడికి రావడం సంతోషంగా ఉందన్నారు. గిరిజన సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉందని, పీఎం జన్‌మన్ పథకం కింద రూ. 24,000 కోట్లు, తెలంగాణకు 23 ఏకలవ్య పాఠశాలలు కేటాయించినట్లు తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, జాతర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ ప్రాంత పర్యాటక అభివృద్ధికి రూ. 80 కోట్లు, రామప్ప ఆలయానికి రూ. 40 కోట్లు, జాతర ఏర్పాట్లకు ఈ ఏడాది రూ. 3.70 కోట్లు కేటాయించినట్లు వివరించారు. మేడారంలో సమ్మక్క - సారలమ్మ పేరుతో రూ. 890 కోట్ల వ్యయంతో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. త్వరలోనే ప్రధాని ఈ ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభిస్తారని ఆయన స్పష్టం చేశారు.

# చిన్నారులను సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచాల్సిందే

మొదటి పేజీ తరువాయి

బలోపేతం చేయడంపై మంత్రి లోకేశ్ అధ్యక్షతన సచివాలయంలో బుధవారం మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, హోం మంత్రి అనిత, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు. లోకేశ్ మాట్లాడుతూ... చిన్నారులకు సంబంధించి సామాజిక మాధ్యమాల వాడకాన్ని నిషేధం విధించే అంశంపై సింగపూర్, ఆస్ట్రేలియా, మలేసియా, ఫ్రాన్స్‌లలో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుని మార్గదర్శకాలు రూపొందించాలని సూచించారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ... మలేసియాలో మై డిజిటల్ ఐడీ, పాస్‌పోర్ట్ వివరాలతో ఈ-కేవైసీ అనుసంధానం ద్వారా 16 సంవత్సరాల పైబడిన వారికి మాత్రమే సోషల్ మీడియా యాక్సెస్ ఉందని తెలిపారు. చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలన్న విషయమై మంత్రుల బృంద సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. అయితే ఎంత వయోపరిమితి విధించాలనే విషయమై వివిధ దేశాల్లో చట్టాలను పరిశీలించాలని మంత్రుల బృందం అధికారులకు సూచించింది.

సామాజిక మాధ్యమాల్లో ఫేక్ వార్తలు పోస్టు చేసే వారితో పాటు కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే హ్యాబిచ్యువల్ అఫెండర్స్‌ను కట్టడి చేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. దీనిపై చర్చించేందుకు గూగుల్, మెటా, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమ ప్లాట్‌ఫాం కంప్లయన్స్ ఆఫీసర్లను కూడా వచ్చే సమావేశానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసేవారిపై చర్యలు తీసుకునేందుకు సెక్షన్-46 ఐటీ యాక్ట్ ప్రకారం రాష్ట్రస్థాయి ఎడ్జుడికేటింగ్ ఆఫీసర్ నియామకంపై నోటిఫికేషన్ విడుదల చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని సహయోగ్ పోర్టల్ ద్వారా కొన్ని కేసుల విషయంలో చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా అందరం కలిసి కృషి చేద్దాం

పల్నాడు జిల్లా టిడిపి జిల్లా అధ్యక్షుల ప్రమాణ స్వీకరణ లో ఎమ్మెల్యే కొండయ్య



**చీరాల, జనవరి:30,(సీమకిరణం న్యూస్)** : నూతన పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు పల్నాడు జిల్లా కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమం నరసరావుపేట ఎస్ ఎస్ ఎన్ కళాశాల మైదానం లో అంగ రంగా వైభవం గా నిర్వహించారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి సహచర శాసనసభ్యులు మరియు మంత్రివర్యులు, పార్లమెంట్ సభ్యులు తో కలిసి చీరాల ఎమ్మెల్యే కొండయ్య పాల్గొని నూతనం గా ప్రమాణ స్వీకారం చేసి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ జానీ సైదా కి, అలాగే జిల్లా కమిటీ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ పార్టీ బలోపేతం, ప్రజాసేవే లక్ష్యంగా అంకితభావంతో పనిచేస్తూ పల్నాడు జిల్లాలో తెలుగుదేశం పార్టీని మరింత బలంగా తీర్చిదిద్దాలని నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో వివిధ శాఖల మంత్రులు, శాసనసభ్యులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.

# మహా పాపం నిజం

అది నెయ్యేకాదు కల్తీ నిజమే అనే నినాదం గోడ పత్రికలతో నిరశన

జగన్ అండ్ కో లడ్డు కల్తీ వ్యవహారంతో భక్తుల మనో భావాలు దెబ్బ



**పర్చూరు, జనవరి:30,(సీమకిరణం న్యూస్)** : రాష్ట్రము లో అరాచకపాలన కొనసాగించి, దేవుళ్లను కూడా వదలకుండా అరాచకాలు సృష్టించారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలు అరాచకాలు దేవుణ్ణి కూడా వదల లేదని తిరుపతి శ్రీవారి లడ్డును అపవిత్రం చేసిన కల్తీ నెయ్యి వ్యవహారం పై భక్తుల మనోభావాలను దెబ్బతీసిన జగన్ అండ్ గ్యాంగ్ కువ్యతిరేకంగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు మహా పాపం నిజం అనే గోడ పత్రికలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడు తూ వైసీపీ అరాచకపాలనకు ప్రజలు విసిగిపోయి సాగనంపారని ఏద్దేవా చేశారు. దేవుళ్ళు ను కూడా వదలకుండా అరాచకాలు చేశారని ఈ పాపం వారిని ఊరకనే వదలదని హెచ్చరించారు. అధికారం కోల్పోయిన తరువాత కూడా ప్రజలకు కళ్ళబొల్లి మాటలు చెపుతున్నారని, కూటమి ప్రభుత్వం లో ప్రజలకు సంక్షేమపథకాలు అందిస్తూ రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు.

# సరళ సేవలు అభినందనీయం

అంగన్వాడీ కార్యకర్త సరళ సిబ్బంది కి ఆదర్శం

పదవి విరమణ చేసిన కార్యకర్త సరళ కు ఘన సన్మాణం

సిడిపిఓ ఝాన్సీ



**చీరాల, జనవరి:30,(సీమకిరణం న్యూస్)** : అంగన్వాడీ టీచర్ నరాల శెట్టి సరళ సేవలు అభినందనీయమని వేటపాలెం సిడిపిఓ ఝాన్సీ తెలిపారు. శుక్రవారం వేటపాలెం సెక్టర్ లోని రావురిపేట వన్ లోపనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్త సరళ పదవి వివరణ సందర్భంగా ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మృదుభాషిగా, మితభాషిగా, అంకితభావంతో పనిచేసిన ఆమె సేవలు అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. సరళను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్ వన్ సూపర్వైజర్ సజ్జా పుష్పవల్లి, సరళ కుమారులు అనిల్ కుమార్, రవితేజ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే కోట్ల







**డోన్ టౌన్, జనవరి 30,(సీమ కిరణం న్యూస్)**: డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమంలో భాగంగా డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందుప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా, ప్రజలు నీటి సరఫరా, రోడ్లు, పింఛన్లు, విద్యుత్, ఆరోగ్య సదుపాయాలు వంటి ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే కి వివరించారు. ఎమ్మెల్యే ప్రతి వినతిని శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత శాఖాధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజలు ఎప్పుడైనా తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచిస్తూ, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే కోట్ల









**డోన్ టౌన్, జనవరి 30,(సీమ కిరణం న్యూస్)**: డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, బోధనా విధానం, మౌలిక సదుపాయాల పరిస్థితిని ఎమ్మెల్యే పరిశీలించారు. ముఖ్యంగా ఉచిత మధ్యాహ్న భోజన పథకం కింద భోజన తయారీ జరుగుతున్న విధానం, వంటశాల పరిశుభ్రతను నిశితంగా పరిశీలించి సిబ్బందికి అవసరమైనసూచనలుచేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి సరదాగా వాలీబాల్ ఆడి, వారిలో ఉత్సాహం మరియు ఆనందాన్ని నింపారు. ఎమ్మెల్యే ఆత్మీయతతో విద్యార్థులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.

# దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

నిర్లక్ష్యం వహించకండి

ప్రజల్లో మార్పు రావాలి

పోలీసులు ప్రతి రోజు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు

సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మరి మంచిది



**కర్నూలు క్రైమ్, జనవరి 30, (సీమకిరణం న్యూస్)** : రోజురోజుకూ బంగారం ధరలు గణనీయంగా పెరగడంతో దొంగతనాలకు అవకాశం ఇవ్వకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా గృహాల్లో బంగారం, విలువైన ఆభరణాలు భద్రంగా ఉంచుకోవాలని లేదంటే బ్యాంకు లాకర్లలో ఉంచుకోవాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఇటీవల చోటుచేసుకుంటున్న దొంగతనాల నేపథ్యంలో ప్రజలందరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల భద్రతా చర్యల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఇళ్లలో బంగారు నగలు, నగదు వంటి విలువైన వస్తువులను నిల్వ ఉంచకుండా సురక్షిత ప్రదేశాల్లో భద్రపరచాలని , ఇళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలను ముందుగానే అరికట్టవచ్చన్నారు. అపరిచిత వ్యక్తులు బంగారం కు మెరుగులు దిద్దుతాం అంటూ ఇళ్లలోకి వచ్చే ప్రయత్నం చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వివాహాలు, శుభకార్యాల సమయంలో బంగారం ఆభరణాలు ధరించినప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గుంపులుగా ఉండే ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్ వంటివి జరిగే అవకాశం ఉంటుందని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పట్టణ, గ్రామ శివారులలో ఉన్న ఇళ్ళను, ఒంటరి వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుంటూ టార్గెట్గా రెక్కీ చేస్తూ, చైన్ స్నాచింగ్లు, ఇళ్లల్లో చోరీలు చేసి, నంబర్ ప్లేట్లులేని బైకులతో వచ్చి బంగారు ఆభరణాలను ఎత్తు కెళ్తున్నారన్నారు. ఉత్సవాలు, జాతరలకు ఎట్టి పరిస్థితుల్లో నూ బంగారు నగలు వేసుకొని వెళ్లకండా ఉండడం ఉత్తమమన్నారు. అపార్ట్ మెంట్లు , ఇళ్ళ వద్ద భద్రత కు జజుఎ, అలారాలు ఉంచుకోవడం ఉత్తమమన్నారు. ఒంటరిగా నడిచేటప్పుడు లేదా ప్రయాణాల్లో జాగ్రత్త వహించాలన్నారు. అత్యంత విలువైన ఆభరణాలను ఇంట్లో కాకుండా బ్యాంక్ లాకర్లలో దాచుకోవాలన్నారు. ఏదైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, దొంగతనాల ప్రయత్నాలు గమనించినా వెంటనే డయల్ 100 / డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ప్రజల సహకారంతోనే నేరాలను అరికట్టడం సాధ్యమవుతుందని, అప్రమత్తతే భద్రతకు మూలమని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఈ సందర్భంగా తెలియజేశారు.

# ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించాలి

ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లాలో 75 సెంటర్లలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ

ప్రతి పరీక్షా కేంద్రం దగ్గర 144 సెక్షన్ అమలు చేయాలి

కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి





**కర్నూలు ప్రతినిధి, జనవరి 30, (సీమకిరణం న్యూస్)**:- ఫిబ్రవరి 23వ తేది నుండి మార్చి 24వ తేది వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ ఏర్పాట్లతో ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 23 వ తేది నుండి మార్చి 24 వ తేది వరకు 75 సెంటర్ల లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్ జనరల్ లో 43, 379 (మొదటి సంవత్సరం 23,140, రెండవ సంవత్సరం 20,239) మంది విద్యార్థులు హాజరు అవుతున్నారన్నారు.. అదే విధంగా ఇంటర్మీడియట్ వొకేషనల్ లో 5, 285 (మొదటి సంవత్సరం 3,271, రెండవ సంవత్సరం 2,014) మంది విద్యార్థులు హాజరు అవుతున్నారన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 2 వ తేది నుండి మార్చి 13 వ తేది వరకు 6 సెంటర్ల లో నిర్వహించడం జరుగుతుందన్నారు. 1359 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు ఆయా శాఖల అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రశ్నాపత్రాల భద్రతకు ఆర్మ్ గార్డ్స్ ఏర్పాటు తో పాటు పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పోలీస్ అధికారులను ఆదేశించారు.. ప్రశ్నా పత్రాలు స్టోరేజ్ పాయింట్ నుంచి పరీక్ష కేంద్రాలకు వెళ్లే వరకు పోలీసు ఎస్కార్ట్ ఉండాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఎగ్జామినేషన్ హాల్ లో త్రాగు నీరు ఏర్పాటు చేయాలన్నారు.. పరీక్ష కేంద్రాల్లో సరిపడా లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు.. ఫస్ట్ ఎయిడ్ కిట్స్, అవసరమైన మందులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు బస్సు సౌకర్యం ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ఐఓ లాలప్ప, సర్వ శిక్ష అభియాన్ పిఓ లోక్ రాజ్ , డి ఈ ఓ సుధాకర్, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ డి ఈ ఈ నరేష్, 3 టౌన్ ఎస్ఐ పీరయ్య, కలెక్టరేట్ ఏఓ శివరాముడు, అసిస్టెంట్ కమిషనర్ లేబర్ సాంబ శివ, ఏపీ ఎస్పీడీసీఎల్ డిఈ విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.





సర్వేకు డబ్బులు తీసుకోరాదు

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

రైతులతో మర్యాదగా వ్యవహరించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

# రెవెన్యూ శాఖ పనితీరుపై ప్రజల్లో విశ్వాసం పెరగాలి

**కర్నూలు ప్రతినిధి, జనవరి 30, (సీమకిరణం న్యూస్)**: జిల్లాలో రెవెన్యూ శాఖ పని తీరుపై ప్రజల్లో పాజిటివ్ పర్సెప్షన్ రావాలంటే ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీ సర్వే, ఎఫ్ - లైన్, ఐవిఆర్ఎస్ కాల్స్,పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ మెదలకు రెవెన్యూ అంశాలపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎఫ్--లైన్‌లో ఉన్న అన్ని అర్జీలను వేగవంతంగా, నిబంధనల ప్రకారం పరిష్కరించాలని , అర్జీదారులకు అనవసరంగా ఆలస్యం జరగకుండా చూడాలని , రైతుల భూములకు సంబంధించిన పనుల విషయంలో ముందస్తు నోటీస్ ఇచ్చిన తరువాతే ఫీల్డ్ లోకి వెళ్లాలని , రైతుల హక్కులు , గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ సిబ్బందిపై ఉందని తెలిపారు. రైతులతో ఎప్పుడూ మర్యాదపూర్వకంగా, గౌరవంతో వ్యవహరించాలన్నారు. విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలు ప్రతి రోజు తప్పనిసరిగా హాజరు నమోదు చేయాలని , గ్రామంలో హాజరు నమోదు చేసిన తర్వాతనే ఫీల్డ్ కి వెళ్లాలని ఆదేశించారు. అలాగే తమ విధుల పురోగతిపై ప్రతి రోజు సంబంధిత తహశీల్దార్‌కు రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించారు. హాజరు మరియు రిపోర్టింగ్‌లో నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రీ--సర్వే ప్రక్రియలో ఎటువంటి లోపాలు లేకుండా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని, చిన్న పొరపాట్లు కూడా భవిష్యత్తులో పెద్ద సమస్యలకు దారితీయవచ్చని కలెక్టర్ సూచించారు. రీ సర్వే చేయడానికి వెళ్లిన వారు డబ్బులు అడుగుచున్నారుని ఐవిఆర్ఎస్ కాల్స్ రిపోర్టు వచ్చిందని , వీటిపై పద్ధతులు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా రెవెన్యూ శాఖ సిబ్బంది సమన్వయంతో, బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ రైతు - ప్రభుత్వం మధ్య ఉన్న సమస్యను డెస్కటాప్ ద్వారా పరిష్కరించాలని , రైతుల పొలాల దగ్గర సమస్యను ప్రభుత్వ సర్కులర్లు మరియు ఆదేశాలను పాటిస్తూ స్పీకింగ్ ఆర్డర్స్ను ఇవ్వాలని వారికి విషయాన్ని వివరంగా తెలియజేసి సమస్యను పరిష్కరించే చర్యలు తీసుకోవాలని , విస్తీర్ణం లో తేడాలు వచ్చినప్పుడు తప్పనిసరిగా వారి దగ్గర ఉన్న రికార్డులను పరిశీలించి ఎండార్స్మెంట్ ఇచ్చి వారు సంతృప్తి చెందేలాగా వివరించాలని తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం లో ఆర్డిఓ అజయ్ కుమార్ , తహసిల్దార్ శేషఫణి , డిప్యూటీ తాసిల్దారులు , సర్వేయర్లు , విఆర్వోలు మొదలగు వారు పాల్గొన్నారు.

# డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్శిటీ భవన నిర్మాణ పనులను ప్రారంభించిన మంత్రి టీజీ భరత్











ఉర్దూ యూనివర్శిటీ నిర్మాణానికి రూ.కోటి విరాళం ఇచ్చిన మంత్రి టీజీ భరత్

కర్నూలు జిల్లా అభివృద్ధికి భారీ పెట్టుబడులు తీసుకొస్తున్నాం

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్


**కర్నూలు ప్రతినిధి, జనవరి 30, (సీమకిరణం న్యూస్)** : కర్నూలు విమానాశ్రయం సమీపంలో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్శిటీ భవన నిర్మాణ పనులను మంత్రి టీజీ భరత్ పునః ప్రారంభించారు. శుక్రవారం కర్నూలు విమానాశ్రయం సమీపంలో, ఓర్వకల్లు వద్ద మంత్రి టి.జి. భరత్ , పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి తో కలిసి ఉర్దూ యూనివర్శిటీ భవన పునఃనిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉర్దూ యూనివర్శిటీ నిర్మాణానికి తన వంతుగా రూ.1 కోటి విరాళం ఇచ్చామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో కొనసాగి ఉంటే యూనివర్శిటీ భవన నిర్మాణం ఎప్పుడో పూర్తయ్యేదని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఉపయోగపడే ఉర్దూ యూనివర్శిటీ, బీసీ భవన్, కాపు భవన్ వంటి ప్రాజెక్టులను ఆపేశారన్నారు. మైనార్టీ ముస్లిం వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. మంచి చేసే నాయకులను ప్రజలు గుర్తుంచుకోవాలని మంత్రి తెలిపారు. సరైన విద్యను అందించి, విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావచ్చని, దావోస్ పర్యటనలో మంత్రి నారా లోకేష్ తో విద్యా వ్యవస్థ పై చర్చించానని మంత్రి వెల్లడించారు. మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకొస్తున్నారన్నారు. దావోస్ పర్యటనలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని బాగా ప్రమోట్ చేశామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర భవిష్యత్తు మార్చేస్తున్నారన్నారు. ఎన్నడూ లేని విధంగా కర్నూలు జిల్లాకు భారీగా పెట్టుబడులు తీసుకొస్తున్నామన్నారు. ఇప్పటికే రూ.10వేల కోట్ల పెట్టుబడుల పనులు మొదలయ్యాయని, రానున్న రోజుల్లో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2014--2019 కాలంలో ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేయడం ద్వారా మైనార్టీల విద్యాభివృద్ధికి బలమైన పునాది వేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో విశ్వవిద్యాలయానికి సంబంధించిన పనులు ఆగిపోయాయని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యూనివర్సిటీ పనులకు మళ్లీ ఊపు వచ్చిందని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఈ విశ్వవిద్యాలయానికి అవసరమైన ప్రాథమిక మౌలిక వసతుల కోసం జిల్లా కలెక్టర్ ఫండ్స్ ద్వారా రూ.1 కోటి మంజూరు చేయడం జరిగిందని, అందులో రూ.50 లక్షలతో రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా, విశ్వవిద్యాలయ నిర్మాణానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు శ్రీ టి.జి. భరత్ తన స్వంత నిధుల నుంచి రూ.1 కోటి ప్రకటించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉర్దూ విశ్వవిద్యాలయ భవన నిర్మాణ పనులు పూర్తిచేయడానికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ప్రభుత్వ హయాంలోనే ఉర్దూ విశ్వవిద్యాలయ నిర్మాణ పనులను పూర్తిచేసి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టంచేశారు. అలాగే, మైనార్టీ ముస్లిం వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఇమామ్‌లు మరియు మౌజన్లకు గౌరవ వేతనాలను పెంచడం వంటి చర్యల ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తోందని తెలిపారు. ఇక ఓర్వకల్లు ప్రాంతాన్ని రాష్ట్రంలోనే ముఖ్యమైన ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని, ఇప్పటికే అనేక పెట్టుబడులు వస్తున్నాయని, దీని ద్వారా స్థానిక యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ షా వలి ఖాన్, పారిశ్రామికవేత్త బి.కె సింగ్, ఉర్దూ యూనివర్శిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పర్చూరు నియోజకవర్గానికి అరుదైన రాష్ట్ర స్థాయి గౌరవం

ఏపీ విత్తన ధృవీకరణ సంస్థ పాలక మండలి

రాష్ట్ర డైరెక్టర్ గా మాలెంపాటి సత్యనారాయణ

సత్యనారాయణకు ఎమ్మెల్యే ఏలూరి అభినందనలు



**పర్చూరు,జనవరి:30,(సీమకిరణం న్యూస్) :** పర్చూరు నియోజకవర్గానికి రాష్ట్ర స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. వ్యవసాయం అంటే కేవలం సాగు కాదు...నాణ్యమైన విత్తనం నుంచే రైతు భవితవ్యం మొదలవుతుంది. అలాంటి కీలకమైన విత్తన వ్యవస్థను నియంత్రించే రాష్ట్ర స్థాయి సంస్థలో పర్చూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం లభించడం అరుదైన ఘట్టంగా మారింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ పాలక మండలిలో విత్తన వినియోగ రైతుల ప్రతినిధిగా మాలెంపాటి సత్యనారాయణను ప్రభుత్వం నామినేట్ చేసింది. ఈ మేరకు వ్యవసాయ,సహకార శాఖ గురువారం జి ఓ ఆర్ టి నెంబర్ 67 విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.అప్కా నియమావళి ప్రకారం రాష్ట్రస్థాయిలో ఇద్దరు డైరెక్టర్లను నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. బాపట్ల జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన సత్యనారాయణకు అవకాశం లభించడం పర్చూరు నియోజకవర్గానికి అరుదైన గౌరవంగా నిలిచింది. రెండు సంవత్సరాల పాటు ఆయన పాలక మండలి సభ్యుడిగా కొనసాగనున్నారు. రాష్ట్రంలో విత్తనాల నాణ్యత, ధృవీకరణ, రైతులకు అందే విత్తనాల ప్రమాణాలను నిర్ణయించే కీలక సంస్థలో రైతు ప్రతినిధిగా(డైరెక్టర్ గా) సత్యనారాయణ ఉండడం ద్వారా పర్చూరు రైతుల సమస్యలు నేరుగా ప్రభుత్వస్థాయిలో వ్యవసాయ శాఖ వేదికకు చేరనున్నాయి. విత్తన ధృవీకరణ సంస్థ పాలక మండలిలో పర్చూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం లభించడం రైతాంగంలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

**ఎమ్మెల్యే ఏలూరి శుభాకాంక్షలు..**

ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్ గా మాలెంపాటి సత్యనారాయణకు ప్రత్యేక పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శుభాకాంక్షలు తెలిపారు. రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి రాష్ట్ర స్థాయి కీలక బాధ్యత చేపట్టడం అభినందనీయమన్నారు. ఇది పర్చూరు నియోజకవర్గానికి గర్వకారణమని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడే దిశగా సత్యనారాయణ తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.రైతు కుటుంబానికి చెందిన వ్యక్తికి రాష్ట్ర స్థాయి బాధ్యత రావడం అభినందనీయమని, ఇది పర్చూరు నియోజకవర్గానికి దక్కిన గౌరవమని తెలిపారు.వ్యవసాయ రంగంపై అవగాహన ఉన్న వ్యక్తి పాలక మండలిలో ఉండటం వల్ల రైతుల ప్రయోజనాలు మరింత బలంగా ప్రతిబింబిస్తాయని ఎమ్మెల్యే విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది కేవలం వ్యక్తిగత నియామకం కాకుండా, రైతు విధానాల్లో మార్పుకు అవకాశం అని రాజకీయ, వ్యవసాయ వర్గాలు భావిస్తున్నాయి.రాష్ట్ర వ్యవసాయ విధానాలకు ప్రభావం విత్తన ధృవీకరణ సంస్థ నిర్ణయాలు భవిష్యత్తు పంటల దిగుబడిపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఎస్సై నాగార్జున



**ప్యాపిలి జనవరి 30 (సీమ కిరణం):** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై నాగార్జున అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై, బాల్య వివాహాలు, పోక్సో కేసులు, మహిళా భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు, పోక్సో కేసులు, సైబర్ మోసాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, శక్తి యాప్, హెల్మెట్ ధరించడం, మైనర్ డ్రైవింగ్, 100, 112, 1930 వంటి అత్యవసర నంబర్లు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. చట్టాలపై స్పష్టతతో పాటు భద్రతా జాగ్రత్తలు పాటించాలని విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థినుల్లో చట్టలపై అవగాహన పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థినీలు పాల్గొన్నారు

# ప్రజా దర్బార్ కు పోటెత్తిన అర్జీ దారులు



అలస్యం లేకుండా సమస్యలు పరిష్కారిస్తాం అంటూ భరోసా

ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన పార్టీ అధికార ప్రతినిధి

మహేంద్ర నాద్

**చీరాల, జనవరి:30,(సీమకిరణం న్యూస్) :** ప్రజల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని చీరాల శాసనసభ్యులు కొండయ్య ఆదేశానుసారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్ర నాథ్, యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ మరియు, పి ఫోర్ సిబ్బంది నాయకులు ప్రజల వద్ద నుండి వినతులను స్వీకరించారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమానికి మొత్తం 70 పైగా అర్జీలు రాగా వీటిలో ఇంటి నిర్మాణాల కోసం ఒ ఇంటి స్థలాల కోసం 30 అర్జీ లు, పింఛన్లు కొరకు 35 అర్జీ లు,, ఇతర సమస్యలపై 5 అర్జీలు వచ్చాయని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అవసమైన మౌలిక వసతులు, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ఉన్నామని, ప్రజా సమస్యలకు మొదటి ప్రాధాన్యత నిచ్చి అర్జీ లు స్వీకరించి ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారం దిశగా సంబందించిన అధికారులకు పంపి పరిష్కరించేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కౌతువరపు జనార్ధన్, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు , చీరాల మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు లలిత , పట్టణ మహిళా అధ్యక్షురాలు దర్శి నాగేంద్రమణ, జనసేన నాయకులు,కూటమి నాయకులు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, అర్జీ దారులుతదితరులు పాల్గొన్నారు.

# గాంధీ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల నివాళులు




**డోన్ టౌన్, జనవరి 30,(సీమ కిరణం న్యూస్):** మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా డోన్ పట్టణంలోని గాంధీ విగ్రహానికి డోన్ ఎమ్మెల్యేకోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహాత్మా గాంధీ త్యాగాలు, అహింసా మార్గం మరియు దేశ స్వాతంత్ర్య సాధనలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. గాంధీజీ ఆదర్శాలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# ప్రమాదాలు నివారణ పై అధికారులు ప్రత్యేక ద్రుష్టి సారించాలి

రహదారి భద్రతకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి

జిల్లా కలెక్టర్ డా “వి వినోద్ కుమార్



**బాపట్ల, జనవరి:30,(సీమకిరణం న్యూస్) :** ప్రమాదాల నివారణలో బాపట్ల జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్, తెలిపారు. జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం కలెక్టరేట్ లో శుక్రవారం జరిగింది. ప్రమాదాల నివారణకు 78 ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్ గా గుర్తించామని కలెక్టర్ చెప్పారు. ఆ ప్రాంతాలలో ప్రమాదాల నివారపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వాహన ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే ఈడర్ యాప్ లో ప్రమాద వివరాలను నమోదు చేయాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులకు సహాయపడే వారిని రహ్ వీర్ లుగా గుర్తించి రూ.25 వేలు ఆర్థిక బహుమతి ఇస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని కోరారు. రహదారి భద్రతకు అధికారులు సమన్వయంతో పని చేయాలని, రహదారి ప్రమాదాలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. పోలీస్, రవాణా, రహదారులు భవనాల శాఖల ఇంజినీరింగ్, అయితే ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్ లైన్ యాప్ లో ప్రమాదాలను నమోదు చేయాలన్నారు. ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గత నెలరోజుల్లో 14 మంది మృతిచెందగా పదిమంది మరణపాయ స్థితిలో ఉన్నారన్నారు. మరో 18 మంది క్షతగాత్రులయ్యారని వివరించారు. ఈ సంఖ్య పూర్తిగా తగ్గేలా అధికారులంతా కలిసికట్టుగా పని చేయాలని పలు సూచనలు చేశారు. రహదారి ప్రమాదం జరిగినప్పుడు బాధితులకు సహాయపడే వారికి చట్ట ప్రకారం రక్షణ కల్పించాలని కలెక్టర్ చెప్పారు. వారిని ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బందులకు గురిచేయరాదని పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాలలో రవాణా శాఖ నిర్వహించిన కార్యక్రమాలపై సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ జి రామాంజనేయులు, జిల్లా రవాణాశాఖ అధికారి టి కె పరంధామరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్ విజయమ్మ, పి ఆర్ డిఈ ఎన్ రాజన్ బాబు, మునిసిపల్ కమీషనర్ జి రఘునాథరెడ్డి, ఆర్ అండ్ బి డిఈ అరుణకుమారి, జాతీయ రహదారుల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మల్లంపల్లి గ్రామంలో 15 లక్షల సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే కోట్ల






**డోన్ టౌన్, జనవరి 30,(సీమ కిరణం న్యూస్):** డోన్ మండలంలోని మల్లంపల్లి గ్రామంలో గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సీసీ రోడ్‌ను డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నాణ్యమైన రహదారుల నిర్మాణంతో ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా లభించడమే కాకుండా గ్రామాల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

# ఏఎన్ఎం లపై ఇతర శాఖల అదనపు పనిభారంతో తీవ్ర ఇబ్బందులు

జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందచేసిన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు.



**చీరాల :జనవరి:30,(సీమకిరణం న్యూస్) :** బాపట్ల జిల్లా పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్--3 ఏఎన్ఎంలకు వారి మాతృ శాఖ అయిన ఆరోగ్య శాఖ విధులకే పరిమితంగా పని కేటాయించాలని, ఇతర శాఖలకు సంబంధించిన పనులు, అదనపు పనిభారం మోపవద్దని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా జాయింట్ సెక్రెటరీ జయరాజ్ మార్త, బాపట్ల జిల్లా కార్యదర్శి పసుమర్తి శ్రీనివాసరావు, అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ని కలిసి ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి వినతి పత్రం అందచేశారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, ఏఎన్ఎంలు ప్రజారోగ్య వ్యవస్థలో కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా మాతృశిశు ఆరోగ్యం, టీకాల కార్యక్రమాలు, గర్భిణీల సంరక్షణ, పిల్లల ఆరోగ్య పరీక్షలు, వివిధ ఆరోగ్య సర్వేలు, అలానే ఆరోగ్య శాఖకు సంబంధించిన డేటాను పలు యాప్ లు ద్వారా ఆన్లైన్ చేయడం వంటి అత్యంత బాధ్యతాయుతమైన పనులు ఇప్పటికే విస్తృతంగా చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో, ఆరోగ్య శాఖకు సంబంధం లేని ఇతర శాఖల సర్వేలను, ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పంపిణీ, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే విధులను కూడా ఏఎన్ఎం లు చేయాలని ఆ శాఖ అధికారులు, ఏఎన్ఎంలపై ఒత్తిడి తేవడం జరుగుతుందని అన్నారు. ఏఎన్ఎంలపై ఇతర శాఖల పని భారాన్ని మోపడం వల్ల వారి ప్రధాన బాధ్యతల నిర్వహణకు ఆటంకం ఏర్పడటంతో పాటు ఏఎన్ఎంలు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారని వారు జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ కు ఆవేదన వ్యక్తం చేశారు, దీని కారణంగా ప్రజలకు అందాల్సిన ఆరోగ్య సేవల నాణ్యతపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని కలెక్టర్ కు యూనియన్ నాయకులు వివరించారు.ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనల ప్రకారం గ్రేడ్--3 ఏఎన్ఎంలు ఆరోగ్య శాఖ పరిధిలోని విధులనే నిర్వహించాల్సి ఉంటుందని, అయినప్పటికీ క్షేత్రస్థాయిలో ఇతర శాఖల పనులు అప్పగిస్తున్నారని సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ సమస్య పై సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ సంఘం రాష్ట్ర మహిళా జాయింట్ సెక్రెటరీ జయరాజ్ మార్త, బాపట్ల జిల్లా కార్యదర్శి పసుమర్తి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు జె సుధాకర్,జిల్లా మహిళా అధ్యక్షురాలు షేక్ కబీరా,రవిబాబు,సుబ్బారావు, ప్రభావతి, సునీత, రాధా,స్వప్న,రుక్మిణి, చీరాల మరియు వేటపాలెం ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# కుష్ఠ వ్యాధి నివారణ మన అందరి బాధ్యత

డాక్టర్ రాహుల్




**ప్యాపిలి జనవరి 30 (సీమ కిరణం న్యూస్ ) :** గ్రామాల్లో కుష్ఠ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించడం మన అందరి బాధ్యత అని వైద్యాధికారి రాహుల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పోతు దొడ్డి గ్రామంలో డాక్టర్ రాహుల్ సర్పంచ్ సుబ్బన్న , రంగమ్మ ఆధ్వర్యంలో కుష్ఠ వ్యాధి నివారణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ కుష్ఠ వ్యాధి పై అవగాహన పెంచుకోవాలని, వ్యాధిపై ప్రజలో ఉన్న అపోహలను దూరం చేయాలన్నారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు నిర్వహించనున్న సర్వేలో స్థానిక పిహెచ్సి పరిధిలోని గ్రామగ్రామాన వ్యాధి నివారణ కార్యక్రమాలను వివరిస్తూ అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీ పి ఎం ఓ రామచంద్ర రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రాఘవేంద్ర గౌడు, పర్యవేక్షకులు మనోహర్ రెడ్డి, ఎం ఎల్ ఎచ్ పి సుభాహన్, ఏ ఎన్ ఎం రంగమ్మ, ఆశ కార్యకర్త హేమలత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి




**వెల్దుర్తి, జనవరి 30, (సీమకిరణం న్యూస్) :** కేంద్రం ప్రవేశపెట్టిన వి. బి. జి రాంజీ పథకాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ జనవరి 30వ తేదీన మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా వెల్దుర్తి ఎమ్మార్వో కార్యాలయం దగ్గర సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సామూహిక నిరసన దీక్షలు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి అల్లా బకాస్. సిపిఐ మండల కార్యదర్శి టి కృష్ణ. ప్రారంభించారు నిరసన దీక్షలో సిపిఐ సీనియర్ నాయకులు డి రాజు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి చిన్నమాదులు చిన్న వ్యాపారస్తుల సంఘం కార్యదర్శి అనీలు బోయనపల్లె సిపిఐ కార్యదర్శి రాముడు. సిపిఐ మండల నాయకులు శివ సీమును భాష. శివన్న.దస్తగిరి నాగార్జున సూదేపల్లె గ్రామ నాయకులు కృష్ణ మాధవరావు నిరసన దీక్షలో కూర్చున్నారు దీక్ష శిబిరానికి సంపూర్ణగా మద్దతు ప్రకటిస్తున్నామని వైఎస్ఆర్సిపి జడ్పిటిసి సుంకన్న ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు నవీన్ జిల్లా నాయకులు ట్రైలర్ రాముడు మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ జిల్లా నాయకులు గిడ్డయ్య తదితరులు సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న సామూహిక నిరసన దీక్ష కు సంపూర్ణంగా మద్దతు ప్రకటించడం జరిగింది.

# సత్యం,అహింస మార్గం లో స్వాతంత్ర పోరాటం చేసిన యోధుడు గాంధీ

జాతిపిత కు ఘన నివాళులు అర్పించిన టిడిపి అధికారప్రతినిధి

మహేంద్ర,అమర్నాథ్




**చీరాల, జనవరి:30,(సీమకిరణం న్యూస్) :** జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా చీరాల పట్టణం నల్ల గాంధీ బొమ్మ, తెల్ల గాంధీ బొమ్మ , మున్సిపల్ కార్యాలయం నందు ఘన నివాళులు. సత్యం, అహింసలను ఆయుధాలుగా చేసుకుని, బ్రిటీష్ పాలన నుండి భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన యోధుడు జాతిపిత మహాత్మా గాంధీ అని తెలిపారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా చీరాల టిడిపి అధికార పార్టీ ప్రతినిధి మహేంద్ర నాథ్, మరియు యువ నాయకులు గౌరీ అమర్నాథ్ లు చీరాల పట్టణపరిధిలోని నల్లగాంధీ మరియు తెల్ల గాంధీ విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా జాతిపిత మహాత్మా గాంధీ కి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్, సిబ్బంది తో కలిసి మున్సిపల్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన వారి చిత్ర పటానికి కూడా పూల మాలలు వేసి నివాళులు అర్పించి వారు చేసిన త్యాగాన్ని స్మరించు కున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతి సమగ్రత, ఐక్యతను నిలబెట్టేందుకు గాంధీ అనుసరించిన మార్గం అందరికీ ఆదర్శనీయమని, మహిళా సాధికారత, గ్రామ స్వరాజ్యం వంటి గాంధీజీ ఆశయాల సాధనకు అందరం కృషి చేద్దామని, గాంధీ చూపిన అహింస మార్గం లో ముందుకు సాగి వారి ఆశయ సాధన లో ప్రతి ఒక్కరు నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, వైస్ చైర్మన్ ఉల్లిపాయ సుబ్బయ్య, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గుంటుపల్లిలో వృషభరాజ పోటీలు



**వెల్దుర్తి, జనవరి 30, (సీమకిరణం న్యూస్) :** వెల్దుర్తి మండలం గుంటు పల్లె గ్రామంలో గుంటి రంగస్వామి తిరుణాల సందర్భంగా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సంప్రదాయ బండలాగు పందాలను ఘనంగా నిర్వహించారు. పల్లె సంప్రదాయాలకు అద్దం పట్టేలా జరిగిన ఈ పోటీలు ఉత్సాహంగా సాగాయి. పరిసర గ్రామాలు, మండలాలు, జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి పందాలను తిలకించారు. ఈ పోటీలకు ప్రథమ బహుమతిగా సూదేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జయరాముడు రూ.50 వేల నగదు విరాళంగా అందజేయడం విశేషంగా నిలిచింది. న్యూకేటగిరి విభాగంలో ప్యాపిలి మండలం, నంద్యాల జిల్లాకు చెందిన గుంటుపల్లి గ్రామ బండలు విజేతలుగా నిలిచి ప్రశంసలు అందుకున్నాయి.

**న్యూకేటగిరి విభాగం విజేతలు:**

ఆక్షరరెడ్డి రాయవరం, నాగర్‌కర్నూల్ జిల్లా రూ.5,000

దుబ్బన్న కొత్తపల్లె, కర్నూల్ జిల్లా రూ.5,000

చెన్నరెడ్డి (చిన్నకానల) & బీరం బుల్స్ ఎస్.కోత్తురు, నంద్యాల జిల్లా రూ.4,946.03

భుమ్మ గోవర్ధన్‌రెడ్డి బిల్లలాపురం, నంద్యాల జిల్లా రూ.4,500

రమోహన్‌రెడ్డి (బేతంచెర్ల)& దుబ్బన్న (కొత్తపల్లి), కర్నూల్ జిల్లా రూ.4,386.06

సుధాకర్ పి.ఆర్.పల్లె & గోపాల్ కొత్తబురుజు, నంద్యాల జిల్లా రూ.3,883.04

# సైబర్ నేరాలు,లైంగిక వేధింపులు పట్ల అప్రమత్తం ఉండాలి

మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు యువత దూరం గా ఉండాలి

తల్లితండ్రులు పిల్లలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్ పీసీ సుబ్బారావు, రూరల్ ఎసై చంద్రశేఖర్




**చీరాల, జనవరి:30,(సీమకిరణం న్యూస్) :** జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ ఎసై చంద్రశేఖర్ చీరాల సబ్ డివిజన్ శక్తి బృందంతో కలసి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వైయస్సార్ కాలనీ లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఈపురుపాలెం ఎస్సై చంద్రశేఖర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను నిరంతరం గమనిస్తూ ఉండాలని ఎలాంటి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చూడాలని తెలిపారు. చిన్న వయసులోనే చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చూడవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణ విక్రయాలను అరికట్టేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తుందని,పోలీస్ శాఖకు ప్రజలు తమ వంతు సహకారాన్ని అందిస్తే మెరుగైన ఫలితాలను పొందవచ్చునని తెలిపారు. ఎక్కడైనా ఎప్పుడైనా గంజాయి ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తున్న సేవిస్తున్న వారి వివరాలను పోలీసులకు సమాచారం అందచేయాలని సూచించారు, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రజలు పోలీస్ సిబ్బంది కి సహకరించి నేర నియత్రన లో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో రూరల్ ఎసై చంద్రశేఖర్, శక్తి టీమ్ సభ్యులు కానిస్టేబుల్ సుబ్బారావు,స్థానిక ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ కి ఘన నివాళులు అర్పించిన వాకర్స్ సభ్యులు

గాంధీయ మార్గం లో అందరు ముందుకు సాగాలి

గోపరిరక్షణ సమితి కి రూ 2000/- విరాళం అందచేత



**చీరాల, జనవరి :30,(సీమకిరణం న్యూస్) :** స్వాతంత్ర సమగ్రం లో అహిసే ఆయుధం గా పోరాటం చేసిన యోధుడు మహాత్మా గాంధీ అని తెలిపారు.చీరాల ఎన్ ఆర్ ఉపి ఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి మరియు అమరవీరుల దినోత్సవం సందర్భంగా హై స్కూల్ గ్రౌండ్ ఆవరణలో గల మహాత్మా గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్బంగా వాకర్స్ సభ్యులు మాట్లాడుతూ సత్యం, ,అహింస,శాంతి,దేశభక్తి,సామరస్యం కోసం కృషి చేసిన ఆమహనీయుని స్మరించుకుని ఘన నివాళులు అర్పించినట్లు తెలిపారు. అనంతరం గోపరిరక్షణ సమితి వారికి వాకర్స్ సభ్యులు గ్రంధి నరసింహారావు రూ.2,000/- అందజేసి, సభ్యులకు ఫ్రూట్స్ పంపిణీ చేసినారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ చారగుళ్ళ గురుప్రసాద్, గొడవర్తి సుధాకరరావు,నారాయణమూర్తి,వీరాంజనేయులు, మధుసూదనరావు,మాదల చిన్న సుబ్బారావు, నరసింహారావు,రాముడు, తుకారాం,బాల గంగాధరరావు,వాకర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నట్టుండి పెరిగిన బంగారం ధర సడన్ షాక్ ఇచ్చిందిగా



గతేడాది బంగారం ధరలు కాస్త తగ్గుతూ వచ్చాయి. దీంతో మహిళలతో పాటు గోల్డ్ లవర్స్ కొనుగోళ్లకు చాలా ఆసక్తి చూపించారు. కొత్త ఏడాది పసిడి మరింత దిగొస్తుందని భావించారు. కొని దాచుకోవాలని భావించారు. మ్యారేజ్ సీజన్ సమయంలో ధరలు కొండెక్కుతాయి కాబట్టి ఇప్పుడే కొనేస్తే బెటర్ అని భావించారు. కానీ పసిడి తగ్గేదేలే అంటూ పరుగులు పెడుతోంది. కొత్త సంవత్సరం ప్రారంభం నుంచి కూడా గోల్డ్ రేట్స్ భారీగా పెరుగుతూ వస్తున్నాయి. ఇవాళ కూడా ధరలు పెరిగాయి. ఉన్నట్టుండి ఒక్కసారిగా కొండెక్కింది గోల్డ్. ప్రస్తుతం బంగారం ధరలు ఎంత ఉన్నాయి? గోల్డ్ రేట్స్ పెరగడానికి గల కారణాలు ఏంటి? అనేది ఇప్పుడు మనం చూద్దాం..

### గోల్డ్ పైకి.. సిల్వర్ కిందకు..!

నాల్రోజుల తర్వాత గోల్డ్ రేట్స్ స్వల్పంగా పెరిగాయి. హైదరాబాద్‌లో జనవరి 9, గురువారం ఉదయం చూసుకుంటే.. 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.100 పెరిగి.. రూ.72 వేల 250 దగ్గరకు చేరింది. అదే 24 క్యారెట్ల స్వచ్ఛమైన పసిడి రేటు రూ.110 పెరిగి తులం రూ.78 వేల 820 పలుకుతోంది. తగ్గుతూ పోతున్న గోల్డ్ మళ్లీ ఊపందుకోవడానికి అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులే కారణమని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. ఇక, బంగారం ధరలు పెరిగినా.. వెండి మాత్రం స్థిరంగా కొనసాగుతూ సిల్వర్ లవర్స్‌ను ఆకర్షిస్తోంది.

# కాస్త.. రిటర్న్ చూడు గురూ!



పైసల ముచ్చట్లు

కాలం కన్నా వేగంగా మనిషి జీవితంతో ఆడుకుంటున్న వస్తువు ఏదైనా ఉందంటే.. అది డబ్బే! గుండె కూడా లబ్”డబ్బు’ అంటూ నిమిషానికి అరవై కన్నా ఎక్కువసార్లు కొట్టుకుంటుందంటే మనిషికి మనీకి సంబంధం ఎంత స్ట్రాంగో అర్థం చేసుకోవచ్చు. అయితే బతకడానికి డబ్బు కావాలే కానీ, డబ్బే బతుకు కాకూడదు. ఈ సూక్ష్మాన్ని గ్రహించ లేక కొందరు కాసుల వేటలో జీవిత కాలాన్ని కరిగించేసుకుంటారు. ఈ సత్యాన్ని గుర్తించలేక కాణీ సంపాదించకుండా కాలాన్ని భారంగా గడిపేవాళ్లూ ఉంటారు.కానీ, ఈ రెండు వైఖరులూ తప్పే! మన పెట్టుబడి కాలానుగుణంగా వృద్ధి సాధించాలి. అందుకు ఏం చేయాలో? ఈ కొత్త సంవత్సరంలో ఎలా ముందుకు వెళ్లాలో తెలుసుకుందాం.. మనిషి సంపాదనకు గ్యారెంటీ లేదు. జీతభత్యాలు, వ్యాపారంలో లాభాలు పెరిగినంత కాలం ఏ ఇబ్బందీ ఉండదు. కానీ, పరిస్థితులు తారుమారైనప్పుడే డబ్బు విలువ తెలుస్తుంది. రూపాయిని కంటిపాప కన్నా జాగ్రత్తగా చూసుకుంటూ విలువైన జీవితాన్ని కోల్పోతున్నవారు ఎందరో ఉన్నారు. ఎంత కూడబెట్టినా.. ఇంకా ఇంకా సంపాదించాలని పరుగులు తీస్తుంటారు. రాబడి కోసం జీవితాన్ని త్యాగం చేసుకోవద్దు. మనం సంపాదించిన రూపాయి మన కోసం పనిచేసేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. అంటే.. మనం పొదుపు, మదుపు చేసిన రూపాయి.. మన జీవితాన్ని కుదుపులకు గురికాకుండా అదుపు చేయగలగాలి. అలా జరగాలంటే దీర్ఘకాలిక ప్రయోజనాలను ఆశించి ఇన్వెస్ట్‌మెంట్ చేయాలి. అంతేకానీ, క్విక్‌మనీ రేస్‌లో అదృష్టం పరీక్షించుకుంటానంటే కుదరదు.

### ద్రవ్యోల్బణం కొలమానం

రాబోయే లాభాలను దృష్టిలో ఉంచుకొనే ఇన్వెస్ట్ చేస్తారు. నష్టాలు వస్తాయని చెబితే ఎవరూ ఇన్వెస్ట్ చేయరు కదా! లాభం వస్తుందని నమ్మకం ఉంటేనే ముందుకొస్తారు. కానీ, ఆ రిటర్న్ ఎంతన్నది ప్రధానం. మనదేశంలో ద్రవ్యోల్బణం సుమారు ఏడు శాతంగా ఉంటున్నది. అంటే నిత్యావసరాల ధరల్లో ఏటా ఏడు శాతం పెరుగుదల కనిపిస్తుందన్నమాట! ఇంకా చెప్పాలంటే మన ఖర్చులు ప్రతి సంవత్సరం రమారమి ఏడు శాతం పెరుగుతాయి. ఈ మేరకు మన పెట్టుబడిపై వచ్చే రిటర్న్ ఏడు శాతంగానే ఉందనుకోండి.. అప్పుడు మీకు వచ్చే లాభశాతం సున్నా! ద్రవ్యోల్బణం కన్నా తక్కువ శాతం రిటర్న్ వచ్చే ఇన్వెస్ట్‌మెంట్ వల్ల మీ డబ్బు కరిగిపోతుంది తప్ప.. పెరగదు. అందుకే, మన ఇన్వెస్ట్‌మెంట్‌పై వచ్చే రిటర్న్ ఏడు శాతం కన్నా ఎక్కువగా ఉన్నప్పుడే అది మేలైన పెట్టుబడి అవుతుంది. అప్పుడే మీ రూపాయి మరో రూపాయిని సంపాదిస్తున్నట్టుగా భావించాలి. దీర్ఘకాలం పెట్టుబడి అయితే మ్యూచువల్ ఫండ్స్ మంచి ఎంపిక. కనీసం 14 శాతం రిటర్న్ ఇక్కడ పొందే వెసులుబాటు ఉంటుంది. అపార్ట్‌మెంట్ ఫ్లాట్ మీద ఇన్వెస్ట్ చేసినా మంచిదే! ప్రతినెలా అద్దె రూపంలో ఆదాయం వస్తుంది! నెలవారీగా ఎలాంటి ఆదాయాన్ని ఇవ్వని స్థలం కన్నా అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ తీసుకోవడం మంచి పద్ధతి. బంగారం మీద ఇన్వెస్ట్‌మెంట్ కూడా 12 శాతం వరకు రిటర్న్ ఇస్తుంది. అయితే బంగారాన్ని బిస్కెట్ రూపంలో, బాండ్ రూపంలో కాకుండా.. ఆభరణాల రూపంలో కొనుగోలు చేయడం అవసరం. ఆ నగలను మీ ఇంట్లోవాళ్లు ధరించినప్పుడు వాళ్లు పొందే ఆనందాన్ని వెలకట్టలేం కదా! ఇలా రకరకాల రూపంలో ఇన్వెస్ట్ చేసి లాభాలు ఆర్జించొచ్చు.

### బీమా తర్వాతే ఏదైనా..

మీ జీవన సౌధానికి హెల్త్ ఇన్సూరెన్స్ పిల్లర్స్ లాంటివి. ఆ తర్వాత మీరు చేసే పెట్టుబడులు స్లాబుల్లాంటివి. పిల్లర్స్ లేకుండా ఎన్ని అంతస్తులు కడితే మాత్రం ఏం ప్రయోజనం? ఒక్క కుదుపుతోనే మీ జీవితం కుప్పకూలిపోతుంది. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి, మధ్యతరగతి, సగటు ఉద్యోగి అందరూ ఆరోగ్య బీమా కాన్సెప్ట్‌ను లోతుగా అర్థం చేసుకోవాలి. పాతికేండ్ల తర్వాత వైద్యానికయ్యే ఖర్చులను అంచనా వేసి.. ఆ మొత్తానికి ఇన్సూరెన్స్ తీసుకోవాలి. ముందుగా హెల్త్ ఇన్సూరెన్స్, తర్వాత కుటుంబ వ్యవహారానికయ్యే ఖర్చులు ఆ తర్వాతే ఇన్వెస్ట్‌మెంట్ గురించి ఆలోచించాలి. లేకపోతే ఊహించని ప్రమాదం జరిగి ఆస్పత్రిపాలైనా, దీర్ఘకాలిక వ్యాధిబారిన పడినా.. మీ కుటుంబం ఆర్థికంగా ఇరవై ఏండ్లు వెనకబడిపోతుందని గుర్తుంచుకోండి. కుటుంబసభ్యులు నలుగురు ఉన్నట్టయితే.. కోటి నుంచి కోటిన్నర రూపాయల హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం అవసరం. ఆరోగ్య బీమా విషయంలో పెద్దగా ఆలోచించి.. ఎక్కువ మొత్తానికి తీసుకుంటే మీ భవిష్యత్తుకు భరోసా ఇచ్చినవారు అవుతారు!

# మార్కెట్లను ముంచిన జీడీపీ



తీవ్ర ఊగిసలాటల మధ్య నష్టపోయిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాల పరంపర కొనసాగుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ నాలుగేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోనున్నదని కేంద్ర ప్రభుత్వం అంచనాలను విడుదల చేయడం మదుపరుల్లో ఆందోళన నెలకొన్నది. తీవ్ర ఊగిసలాటల మధ్య కొనసాగిన సూచీలు చివరకు నష్టాల్లో ముగిశాయి. కార్పొరేట్ల మూడో త్రైమాసికపు ఆర్థిక ఫలితాలు కూడా ప్రారంభంకానుండటం కూడా మదుపరుల్లో ఆందోళన నెలకొన్నది. వీటికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధుల ఉపసంహరణ కొనసాగుతుండటం, రూపాయి మరింత బలహీనపడటం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 50.62 పాయింట్లు కోల్పోయి 78,148.49 వద్ద ముగిసింది. మరోసూచీ నిఫ్టీ 18.95 పాయింట్లు కోల్పోయి 23,688.95 వద్ద నిలిచింది. దేశ ఆర్థిక వ్యవస్థ నెమ్మదించనుండటం, క్యూ3లో కార్పొరేట్లు నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించే అవకాశాలుండటం మార్కెట్లో తీవ్ర ఆటుపోటులకు లోనయ్యాయని, చివర్లో బ్లూచిప్ సంస్థల నుంచి లభించిన మద్దతుతో భారీ నష్టాల నుంచి కోలుకున్నాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. అమెరికా బాండ్ ఈల్డ్‌లు పెరుగుతుండటం, ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలు సన్నగిల్లడం కూడా మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. 30 షేర్ల ఇండెక్స్‌లో అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్అండ్‌టీ, సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్‌టీపీసీ, ఎస్బీఐ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. కానీ, టీసీఎస్, రిలయన్స్, ఐటీసీ, హెచ్‌సీఎల్ టెక్, మారుతి లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 1.12 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.08 శాతం చొప్పున నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే కన్స్యూమర్ డ్యూరబుల్ 1.86 శాతం నష్టపోగా, క్యాపిటల్ గూడ్స్ 1.34 శాతం, సర్వీసెస్ 1.26 శాతం, పవర్ 1.17 శాతం, యుటిలిటీ రంగ షేర్లు కుదేలవగా..ఎనర్జీ, ఐటీ, ఆయిల్‌అండ్‌గ్యాస్, రియల్టీ, టెక్, ఐటీ రంగ సూచీలు లాభాల్లో ముగిశాయి.

### స్టాండర్డ్ గ్లాస్ ఐపీవో 182 రెట్ల బిడ్డింగ్‌లు

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ ఐపీవోకి అపూర్వ స్పందన లభించింది. సంస్థ జారీ చేసిన షేర్ల కంటే 182.57 రెట్ల అధిక బిడ్డింగ్‌లు దాఖలయ్యాయి. రూ.410 కోట్ల నిధుల సేకరణకు సంబంధించి సంస్థ జారీ చేసిన 2,08,29,567 షేర్లకుగాను 3,80,27,59,991 షేర్ల బిడ్డింగ్‌లు దాఖలయ్యాయి. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ విభాగం నుంచి అత్యధికంగా 327 రెట్ల సబ్‌స్క్రిప్షన్ కాగా, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ 275 రెట్లు, రిటైల్ విభాగం 64 రెట్లు అధికంగా బిడ్లు వచ్చాయి. సోమవారం ప్రారంభమైన ఈ వాటా విక్రయం బుధవారం ముగిసింది. ఇష్యూ సైజ్ రూ.133-140 మధ్యలో నిర్ణయించింది.

### రూపాయి కకావికలం

రూపాయి కకావికలమైంది. వరుసగా రెండోరోజు బుధవారం ఒకేరోజు 17 పైసలు పడిపోయి చారిత్రక కనిష్ఠ స్థాయి 85.91కి పడిపోయింది. అమెరికా కరెన్సీ డాలర్ మరింత బలోపేతం కావడం, క్రూడాయిల్ ధరలు భగ్గుమండటం వల్లనే రూపాయి భారీగా పతనమైంది.

# 2030 నాటికి 17 కోట్ల కొత్త జాబ్స్ ఫ్యూచర్ జాబ్స్ నివేదికలో



వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ కూడా ‘ఫ్యూచర్ జాబ్స్ రిపోర్ట్-2025’లో కీలక విషయాలను ప్రకటించింది. ఈ నేపథ్యంలో 2030 నాటికి 17 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడతాయని తెలిపింది. దీంతోపాటు 9.2 కోట్ల ఉద్యోగాలు కోల్పోవాల్సి రావచ్చని వెల్లడించింది. ఆ వివరాలేంటో ఇక్కడ తెలుసుకుందాం. కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవడంలో భారతీయ కంపెనీలు ప్రపంచాన్ని అధిగమించేందుకు సిద్ధంగా ఉన్నాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ తాజా ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ నివేదిక ప్రకారం భారతీయ కంపెనీలు ఏఐ, రోబోటిక్స్, ఎనర్జీ టెక్నాలజీల వంటి రంగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి.

### ఏ ఉద్యోగాలు హిట్

నివేదిక ప్రకారం 35% భారతీయ కంపెనీలు సెమీకండక్టర్లు, కంప్యూటింగ్ టెక్నాలజీ తమ వ్యాపారాన్ని పూర్తిగా మార్చగలవని విశ్వసిస్తున్నాయి. అయితే ఈ సంఖ్య ప్రపంచవ్యాప్తంగా 20% మాత్రమే. అదేవిధంగా 21% భారతీయ యజమానులు క్వాంటం, ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీని ముఖ్యమైనవిగా భావిస్తారు, ఇది ప్రపంచంలోని 12%గానే ఉంది. బిగ్ డేటా, మెషీన్ లెర్నింగ్, సైబర్ నిర్వహణ వంటి ఉద్యోగాలు భారతదేశంలో వేగంగా వృద్ధి చెందుతాయని తెలిపింది. ఇవి భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ట్రెండ్‌లకు సరిపోతాయని చెప్పింది. టాలెంట్ కొరతను ఎదుర్కొనేందుకు భారతీయ కంపెనీలు కొత్త పద్ధతులను అవలంబిస్తున్నాయని ప్రస్తావించింది.

### భారతదేశంలో నైపుణ్యాలకు డిమాండ్

67% కంపెనీలు కొత్త, విభిన్న టాలెంట్ పూల్స్‌పై దృష్టి సారిస్తున్నాయి. 30% కంపెనీలు డిగ్రీ షరతును తొలగించి నైపుణ్యాలకు ప్రాధాన్యతనిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ గణాంకాలు వరుసగా 47%, 19%గా ఉన్నాయి. నైపుణ్యాల డిమాండ్‌లో భారతదేశం, అమెరికా అగ్రస్థానంలో ఉన్నాయి. కానీ వ్యత్యాసం ఏమిటంటే అమెరికాలో ప్రజలు దాని అధ్యయనంపై ఆసక్తి చూపుతున్నారు. అయితే భారతదేశంలో కార్పొరేట్ కంపెనీలు తమ ఉద్యోగులకు నేర్పించడానికి పెట్టుబడి పెడుతున్నాయి.

### 2030 నాటికి భారతదేశంలో ఏమి మారుతుంది?

2030 నాటికి డిజిటల్ టెక్నాలజీల విస్తరణ, వాతావరణ చర్యలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు భారతదేశంలో ఉద్యోగాలను పునర్నిర్మించగలవని నివేదిక సూచిస్తుంది. ఇది కాకుండా భారతదేశ యువత జనాభాకు ప్రధాన సహకారం ఉంటుంది. నివేదిక ప్రకారం రాబోయే సంవత్సరాల్లో ప్రపంచ శ్రామిక శక్తిలో మూడింట రెండు వంతుల మంది భారతదేశం, ఆఫ్రికా వంటి ప్రాంతాల నుంచి ఉంటారు.

### ప్రపంచంలో ఉద్యోగాల పరిస్థితి

నివేదిక ప్రకారం 2030 నాటికి 170 మిలియన్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడతాయి. ఇదే సమయంలో 92 మిలియన్ల ఉద్యోగాలు కూడా కోల్పోతారు. అంటే 78 మిలియన్ల కొత్త ఉద్యోగాలు వచ్చే ఛాన్సుంది. కొత్త ఉద్యోగాలలో రైతులు, డెలివరీ డ్రైవర్లు, సాఫ్ట్‌వేర్ డెవలపర్లు వంటి జాబ్స్ ఉంటాయి. అదే సమయంలో కారణంగా క్యాషియర్, అడ్మిన్ అసిస్టెంట్ వంటి జాబ్స్ తగ్గుతాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఉన్న 40% నైపుణ్యాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందని నివేదిక పేర్కొంది. 63% మంది యజమానులు తమ వ్యాపారాన్ని మార్చడానికి ఇదే అతిపెద్ద అడ్డంకిగా భావిస్తున్నారు. ఈ క్రమంలో కొత్త టెక్నాలజీలు, నైపుణ్యాలను అలవర్చుకోవడానికి సిద్ధంగా ఉన్న వారికే భవిష్యత్‌లో ఉద్యోగాలు ఉంటాయని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఈ రేసులో భారత్ చేరడమే కాకుండా అనేక విధాలుగా ముందుందని తెలిపింది.

# రూపాయి పతనం ఆగేదెక్కడ..?



రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే భారీగా క్షీణించడం ఆర్థిక వ్యవస్థపై విస్తృతమైన ప్రభావాన్ని చూపుతున్నది. 2025, జనవరి 13న రూపాయి విలువ 86.62గా నమోదు కావడం రెండేండ్ల అత్యల్ప స్థాయిని సూచిస్తున్నది. ఈ పరిస్థితి రూపాయి బలహీనతను, అంతర్జాతీయ పరిస్థితుల్లో మార్పులను ప్రతిబింబిస్తున్నది. అమెరికా ఆర్థిక వ్యూహాలు, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు ప్రభావంతో డాలర్ బలపడింది. డాలర్ ఇండెక్స్ 110 స్థాయిని దాటింది. అమెరికా ఎన్నికల అనంతరం డాలర్ డిమాండ్ పెరగడం రూపాయి పతనానికి కారణమైంది. ముడి చమురు ధరల పెరుగుదల మరో కారణంగా చూడవచ్చు. బ్రెంట్ క్రూడాయిల్ ధర 80 డాలర్లకు చేరడం రూపాయి విలువపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నది. ఫలితంగా భారత్ వంటి చమురు దిగుమతిదారులపై అధిక భారం పడుతున్నది. భారత మార్కెట్లలో నెగెటివ్ సెంటిమెంట్ పెరగడంతో విదేశీ పెట్టుబడులు తగ్గడం కూడా రూపాయి పతనానికి మరో కారణం అనుకోవచ్చు. రూపాయి పతనంతో సామాన్య ప్రజలపై భారం పడుతున్నది. పెట్రోల్, డీజిల్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నది. దిగుమతులతో సంబంధమున్న వస్తువుల ధరలు అధికమవుతాయి. విదేశీ విద్య భారంగా మారుతుంది. ఎగుమతులపై రూపాయి పతనం ప్రభావం చూపుతుంది. ఎగుమతులకు కొంతకాలం మద్దతు అందించినా, దీర్ఘకాలంలో దిగుమతుల వ్యయాన్ని తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవడం అవసరం. రూపాయి పతనం ఆర్థిక వ్యవస్థపై నేరుగా ప్రభావం చూపుతుంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు తగ్గిపోతాయి. పరిశ్రమలపై ప్రభావం చూపుతుంది. చమురు ఆధారిత పరిశ్రమలు, దిగుమతి వ్యాపార సంస్థలు నష్టాల బారినపడే అవకాశం ఉంటుంది. రూపాయి విలువ స్థిరీకరణ కోసం ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్లో ఆర్బీఐ జోక్యం చేసుకోవాలి. వడ్డీ రేట్లను సర్దుబాటు చేయడం ద్వారా ద్రవ్యోల్బణ నియంత్రణ చేపట్టాలి. భారతీయ ఉత్పత్తుల పోటీదనాన్ని పెంచేందుకు విధానాలు అమలు చేయడం, కొత్త అంతర్జాతీయ మార్కెట్లను అన్వేషించడం, ఎగుమతులకు ప్రోత్సాహం అందించడం వంటి చర్యలు సానుకూల ఫలితాలను అందిస్తాయి. అవసరమైన వస్తువుల స్థానిక ఉత్పత్తిని పెంచడం, దిగుమతులను తగ్గించడం, స్వదేశీ చమురు, గ్యాస్ వనరుల శోధన, వాడకం పెంపు వంటి చర్యలు చేపట్టడం వలన రూపాయి పతనాన్ని నిలువరించవచ్చు . మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడం, ప్రైవేట్, ప్రభుత్వ రంగాలలో స్వదేశీ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పతనాన్ని అడ్డుకోవచ్చు. రూపాయి పతనం భారత ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నప్పటికీ, సమర్థమైన వ్యూహాలను అమలు చేయడం ద్వారా దీన్ని అదుపులోకి తేవడం సాధ్యమే. సత్వర చర్యలతో పాటు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపాయి విలువను స్థిరంగా ఉంచడానికి సహాయపడతాయి. భారత ప్రభుత్వం, ఆర్బీఐ కలసి సమన్వయంతో చర్యలు తీసుకుంటే, రూపాయి పతనాన్ని ఆపొచ్చు. దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చు.

# బడ్జెట్‌లో కొత్త ఆదాయ పన్ను చట్టం?



నరేంద్ర మోదీ సర్కార్ మరో విప్లవాత్మక చర్యలకు శ్రీకారం చుట్టబోతున్నదా.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇది నిజమేననిపిస్తున్నది. ఆరు దశాబ్దాల క్రితం రూపొందించిన ఆదాయపు పన్ను చట్టాన్ని మార్చే దిశగా చర్యలకు ఉపక్రమించినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఇందుకు సంబంధించి వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌లో ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టేయోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తున్నది. రెండో విడత సమావేశాల్లో ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టనున్నారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈసారి బడ్జెట్ సెషన్‌లో కొత్త ఆదాయపు పన్నుకు సంబంధించి బిల్లును ప్రవేశపెడుతాం. ఇది పూర్తిగా కొత్త చట్టం. ప్రస్తుతం ఉన్న చట్టాన్ని సవరించేయోచన లేదు. ప్రస్తుతం ఇందుకు సంబంధించి ముసాయిదాను న్యాయమంత్రిత్వ శాఖ పరిశీలిస్తున్నదని అధికారులు వెల్లడించారు. ఈ నూతన ఆదాయ పన్ను చట్టం, 1961ని గడిచిన ఆరు నెలలుగా సమీక్షించి చివరకు పాత చట్టాన్ని మరింత సులభతరం చేస్తూ, నిబంధనలు అందరికీ అర్థమయ్యేలా ఈ కొత్త చట్టాన్ని తెస్తున్నారు. ఈ చట్టం ప్రకారం పేజీలను 60 శాతం తగ్గనున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్..2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను సార్వత్రిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టబోతున్నారు. ఇందుకు సంబంధించి 6,500 మంది సూచనలు ఆధారంగా ఈ నూతన చట్టాన్ని రూపొందించినట్లు చెప్పారు.

# ఈపీఎఫ్ సేవలు సరళతరం

## ఇక సులభంగా ఆన్‌లైన్‌లో ఉద్యోగుల వ్యక్తిగత వివరాలను సవరించుకునే అవకాశం




పీఎఫ్ చందాదారులకు ఉద్యోగ భవిష్యనిధి సంస్థ ఈపీఎఫ్‌వో శుభవార్తను అందించింది. పీఎఫ్ చందాదారులు తమ పేర్లను, పుట్టిన తేదీ తదితర వివరాలను మార్చుకోవడాన్ని మరింత సులభతరం చేసింది. ఇకపై యజమాని, ఈపీఎఫ్‌వో ఆమోదం అవసరం లేకుండానే ఆన్‌లైన్‌లో సులువుగా మార్చుకునే వీలు కల్పించింది. ఈ-కేవైసీ పూర్తి చేసిన ఈపీఎఫ్ ఖాతాలను యజమాని జోక్యం లేకుండానే ట్రాన్స్‌పర్ చేసుకునే మరో సదుపాయాన్ని శనివారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నూతన సేవలను కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయా ప్రారంభించారు. ఈపీఎఫ్‌వో చందాదారులకు సంబంధించి వ్యక్తిగత వివరాలు పేరు, పుట్టిన తేదీ, తండ్రి/తల్లి పేరు, వైవాహిక స్థితి, జీవిత భాగస్వామి పేరు, ఉద్యోగంలో చేరిన తేదీ, ఉద్యోగం వీడిన తేదీ వంటి వివరాలు ఇక నుంచి సులభంగా మార్చుకోవచ్చును. 2017 అక్టోబర్ 1 తర్వాత జారీ అయిన ఈపీఎఫ్‌వో చందాదారులు ఈ కొత్త సదుపాయాన్ని వినియోగించుకోవచ్చును. ఇందుకోసం ఎలాంటి డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం లేదు. అలాగే అంతకుముందు ఉన్న చందాదారులు ఈపీఎఫ్ ఆమోదం అవసరం లేకుండానే యాజమాన్యమే అవసరమైన మార్పులు చేసుకునే పెసులుబాటు ఉన్నది. ఇందుకు అవసరమైన డాక్యుమెంట్లను కూడా తగ్గించినట్లు పేర్కొంది. ఈపీఎఫ్‌వో చందాదారుల్లో 27 శాతం మంది ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని, వీటిని సులభతరంగా వ్యక్తిగత వివరాలు సవరించుకోవాలనే ఉద్దేశంతో ఈ నూతన సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మాండవీయా తెలిపారు. ఉద్యోగులు తమ పనిభారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు, ఈ సమయంలోనూ ఈపీఎఫ్‌లో మార్పులు చేయడానికి ఆఫీసుల చుట్టు తిరగాల్సి వస్తున్నదని, ఈ భారం నుంచి తగ్గించాలని వచ్చిన విజ్ఞప్తులతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. మరోవైపు, ఆధార్‌తో లింక్ చేయని పీఎఫ్ ఖాతాల్లో మార్పులు చేయాలంటే డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 8 లక్షలకు పైగా రిక్వెస్ట్‌లు వచ్చాయని, వీటిలో 40 శాతం సమస్యలను ఐదు రోజుల్లో పరిశీలించగా, 47 శాతం రిక్వెస్ట్‌లు 10 రోజుల్లో పూర్తైనట్లు తెలిపారు. ఈ తాజా నిర్ణయంతో 45 శాతం మందికి తక్షణమే ఊరట లభించనుండగా, మరో 50 శాతం కరెక్షన్లు యజమాని దగ్గర పరిష్కారం కానున్నాయి.

# కొటక్ బ్యాంక్ లాభం 4,701 కోట్లు




ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సేవల సంస్థ కొటక్ మహీంద్రా బ్యాంక్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.4,701 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,265 కోట్ల లాభంతో పోలిస్తే 10.22 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.14,096 కోట్ల నుంచి రూ.16,050 కోట్లకు చేరుకున్నట్లు, అలాగే నిర్వహణ ఖర్చులు కూడా రూ.9,530 కోట్ల నుంచి రూ.10,869 కోట్లకు ఎగబాకాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ స్వల్పంగా పెరిగి 1.49 శాతం నుంచి 1.50 శాతానికి చేరుకున్నాయి. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.794 కోట్ల నిధులను వెచ్చించింది. క్రితం ఏడాది కేటాయించిన రూ.660 కోట్లతో పోలిస్తే భారీగా పెరిగాయి.

# ప్రపంచంలో తొలి సీఎన్‌జీ స్కూటర్



ప్రపంచంలో తొలి సీఎన్‌జీ స్కూటర్ అందుబాటులోకి రాబోతున్నది. దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టీవీఎస్..జూపిటర్ సీఎన్‌జీ మాడల్‌ను ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ ఎక్స్‌పో 2025లో ప్రదర్శించింది. జూపిటర్ 125 సీఎన్‌జీ పేరుతో పిలవబడే ఈ స్కూటర్ కిలో సీఎన్‌జీకి 84 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. సీఎన్‌జీ ట్యాంక్‌తోపాటు రెండు లీటర్ల పెట్రోల్ ట్యాంక్‌తో ఈ స్కూటర్‌ను తీర్చిదిద్దింది. 124.8 సీసీ సామర్థ్యంతో రూపొందించిన ఈ స్కూటర్ గంటకు 80 కిలోమీటర్లు వేగంతో దూసుకుపోనున్నది.

# ప్రమాదంలో ప్రభుత్వ బ్యాంకులు




ప్రభుత్వ బ్యాంకులు ప్రమాదంలో పడ్డాయి. రాష్ట్రాలను, ఆయా శాఖల నిపుణులను, పార్లమెంటరీ చర్చలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నది నిజం. ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నా తొలుత పెద్ద నోట్లను రద్దుచేశారు. దీనివల్ల ఏ లక్ష్యమూ నెరవేరకపోగా, సన్న, చిన్న వ్యాపారులు, రైతులు, కూలీలు దారుణంగా నష్టపోయారు. దేశ ఆర్థికవ్యవస్థ కుంగిపోయింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టాయి. దేశ ఆహార భద్రతకు ప్రమాదమని, రైతులు, వ్యవసాయ నిపుణులు, ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టినా పార్లమెంటులో చర్చకు పెట్టకుండానే కేంద్ర ప్రభుత్వం అప్పట్లో వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చింది. వందలమంది అన్నదాతలు చనిపోయాక కానీ ప్రభుత్వం వెనకడుగు వేయలేదు. ఆర్థిక అసమానతలకు, సంపద కేంద్రీకరణకు, కార్పొరేట్ల గుత్తాధిపత్యానికి దారి తీస్తుందని నిపుణులు నెత్తీనోరు బాదుకున్నా ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలకు, లీజులకు కేంద్రం గేట్లు తెరిచింది. దేశ ఆర్థిక వ్యవస్థకే పెను ప్రమాదమని ప్రపంచబ్యాంకు, భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) హెచ్చరిస్తున్నా బ్యాంకుల ప్రైవేటీకరణకు పూనుకొన్నది. స్టేట్‌బ్యాంక్, యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లను మాత్రం (ప్రస్తుతానికి) ఉంచి మిగిలిన ప్రభుత్వ బ్యాంకులన్నింటినీ కార్పొరేట్లకు అప్పగించబోతున్నది. ఇది దేశానికి దురదృష్టకరం. ఆర్థిక సంక్షోభాల బారిన దేశం పడకుండా బ్యాంకులు ఎన్నోసార్లు కాపాడాయి. 1990 నాటి ఆసియా సంక్షోభం, 1990-2000 నాటి లాటిన్ అమెరికా, జపాన్ సంక్షోభాల నుంచి ఆయా దేశాలను కాపాడింది బ్యాంకులే. ప్రపంచబ్యాంకు నివేదిక 2013 ప్రకారం 2007-08 నాటి ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించడంలో భారతదేశం, చైనా ప్రభుత్వ బ్యాంకులు గణనీయమైన కృషి చేశాయి. ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా వ్యవసాయంతోపాటు చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు గణనీయంగా నిధులు అందించాయి. నాడు ప్రభుత్వ బ్యాంకులన్నీ 100 శాతం లక్ష్యాలను నెరవేర్చడం వాటి ఘన విజయమే. భారత ఆర్థిక వ్యవస్థను కాపాడిన ప్రభుత్వ బ్యాంకులను ఆదర్శంగా తీసుకుని అమెరికా సహా పలు దేశాలు తమ బ్యాంకుల్లో ప్రభుత్వ వాటాలను గణనీయంగా పెంచుకున్నాయి. 1947 నుంచి 1969 వరకు అప్పటి ప్రైవేటు బ్యాంకులు అన్నదాతలకు అందించిన రుణం కేవలం రూ.100 కోట్లు. బ్యాంకుల జాతీయాకరణ తర్వాత 1969 నుంచి 2020 వరకు వ్యవసాయానికి బ్యాంకులు అందించిన రుణం రూ. 15 లక్షల కోట్లు. నగరాలు, పట్టణాల్లో మాత్రమే ప్రైవేటు బ్యాంకులు సేవలు అందిస్తే, బస్సు కూడా తిరగని మారుమూల పల్లెల్లోనూ ప్రభుత్వ బ్యాంకులు శాఖలు తెరిచి రైతులు, వ్యాపారులకు రుణాలు అందిస్తూ గ్రామీణుల ప్రగతికి బాటలు వేస్తున్నాయి. అంతెందుకు, ప్రభుత్వం గర్వంగా చెప్పుకొనే జనధన్ ఖాతాల్లో 97 శాతం ప్రభుత్వ బ్యాంకుల్లో ఉన్నవే. ప్రపంచంలోని టాప్‌టెన్ కుబేరుల్లో ఐదుగురు భారతీయులే ఉన్నారు. కానీ వాళ్లలో ఒక్కరి డిపాజిట్లు కూడా ప్రభుత్వ బ్యాంకుల్లో లేవన్నది నిజం. ప్రస్తుతం ప్రభుత్వ బ్యాంకుల్లో ఉన్న రూ.45 లక్షల కోట్ల డిపాజిట్లన్నీ సామాన్య ప్రజలవే. అలాంటి సామాన్యుల డిపాజిట్లకు భద్రత కల్పించే ఎఫ్ఆర్‌డీఐ చట్టాన్ని సడలించి ఆ సొమ్మును కూడా కార్పొరేట్ల రుణమాఫీకి తరలించేందుకు కేంద్రం యత్నించింది. అయితే, పెల్లుబికిన ప్రజా వ్యతిరేకతతో ఆ తర్వాత వెనుకడుగు వేసింది. రిజర్వు బ్యాంక్ ఏర్పడిన తర్వాతి నుంచి 1969 వరకు 1500కుపైగా ప్రైవేటు బ్యాంకులు మూతపడ్డాయి. ఇటీవలి కాలంలో గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్, లక్ష్మీ విలాస్ వంటి బ్యాంకులు చేతులెత్తేశాయి. దీంతో డిపాజిటర్లు దారుణంగా నష్టపోయారు. అదే సమయంలో ప్రభుత్వ బ్యాంకులు లాభాల బాటలో పయనిస్తున్నాయి. 2009-10 నుంచి 2019-20 మధ్య ప్రభుత్వ బ్యాంకులు రూ. 14,53,341 కోట్లు ఆర్జించాయి. ఇలా లాభాల్లో ఉన్న బ్యాంకులను ప్రైవేటీకరిస్తే కార్పొరేట్లకే లాభం తప్ప దేశానికి ఒరిగేదేమీ ఉండదు. ప్రభుత్వ బ్యాంకుల్లోని మొండి బకాయిలన్నీ కార్పొరేట్ సంస్థలవే కావడం గమనార్హం. ప్రభుత్వ పెద్దల సిఫారసుతో రుణాలు పొంది బ్యాంకులకు వేలకోట్లు ఎగనామం పెట్టింది ఇవే. ఇలాంటి ఎగవేతదారులకే కేంద్రం రూ. 7.89 లక్షల కోట్లు మాఫీ చేసింది. నిజానికి పెద్ద బ్యాంకులతోనే దేశానికి అసలు ముప్పు పొంచి ఉన్నది. చిన్న చిన్న బ్యాంకులను విలీనం చేసి పెద్ద బ్యాంకులను చేయాలనుకుంటున్న కేంద్రం ఈ విషయమై ఆలోచించాలి. దీనివల్ల వేలమంది ఉద్యోగాలు కోల్పోతారు. దీనివల్ల మరో ముప్పు ఏంటంటే.. ఎంతపెద్ద బ్యాంకు కుప్పకూలితే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ అంత భారీగా నష్టపోతుందని ఆర్థికరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2007-08లో అమెరికా, యూరప్ దేశాల్లోని అతిపెద్ద బ్యాంకులు కుప్పకూలడం వల్లే ఆ దేశాల ఆర్థిక వ్యవస్థలు కుదేలైనట్టు ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అప్పట్లో చెప్పారు. పారిశ్రామికవేత్తలకు బ్యాంకు లు పెట్టుకునేందుకు లైసెన్సులు ఇస్తామని ఆర్బీఐ-ఐడబ్ల్యూజీ కమిటీ ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని కమిటీలోని 9/10 మంది వ్యతిరేకించినా కేంద్రం పట్టించుకోలేదు. బ్యాంకింగ్ రంగం పారిశ్రామికవేత్తల వశమైతే అది దేశానికే పెను ప్రమాదమన్న వాస్తవాన్ని గుర్తించాలి. అప్పట్లో ఇలాంటి చర్చే అమెరికాలోనూ జరిగినా ఆ తర్వాత వాస్తవాన్ని గుర్తించి ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. 1930 నుంచి 30 ఏండ్లపాటు విజయవంతంగా పనిచేస్తున్న ప్రభుత్వ బ్యాంకును 1968లో అమెరికా ప్రైవేటీకరించింది. ఈ బ్యాంకుతోపాటు మరో ప్రైవేటు బ్యాంకు కుప్పకూలడం వల్లే అమెరికా ఆర్థిక వ్యవస్థ అప్పట్లో అంతగా కుదేలైంది. ఈ రెండు బ్యాంకుల నిర్వాకం వల్ల 5.4 ట్రిలియన్ డాలర్లను అమెరికన్లు కోల్పోయారు. ఈ బ్యాంకులను తిరిగి గాడినపెట్టేందుకు రెండుసార్లు బెయిలవుట్ ప్రకటించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో గత్యంతరం లేక తిరిగి వాటిని జాతీయం చేసింది. కాబట్టి ఇవన్నీ చూసైనా ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణను కేంద్రం ఉపసంహరించుకోవాలి.

# రెండోరోజూ అదే జోష్ ఆటో ఎక్స్‌పోలో కొనసాగుతున్నఈవీల జోరు










దేశీయ ఆటోమొబైల్ ఎక్స్‌పోలో ఈవీల జోరు కొనసాగుతున్నది. వరుసగా రెండో రోజు శనివారం కూడా ప్రధాన ఆటోమొబైల్ సంస్థలతోపాటు చిన్న స్థాయి సంస్థలు కూడా పలు ఈవీలను ప్రదర్శించాయి. ఈసారి జరుగుతున్న ఆటోమొబైల్ ఎక్స్‌పోలో ఈవీలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చాయి కంపెనీలు. సోలార్‌తో నడిచే ఈవీతోపాటు ప్రీమియం ఈవీ కార్లు, కమర్షియల్ వాహనాలు, ట్రక్కులు, స్కూటర్లు, చిన్న స్థాయి కమర్షియల్ వాహనాలతో ఆటోమొబైల్ ఎగ్జిబిషన్ కళకళలాడింది.

### సోలార్‌తో నడిచే ఈవీ

ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. తాజాగా సోలార్‌తో నడిచే ఎలక్ట్రిక్ వాహనాన్ని దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది వావే మొబిలిటీ. ఈవా పేరుతో విడుదల చేసిన ఈ కారు రూ.3.25 లక్షలు మొదలుకొని రూ.6 లక్షల గరిష్ఠ ధరతో లభించనున్నది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఈ సందర్భంగా కంపెనీ సీవోవో విలాస్ దేశ్‌పాండే మాట్లాడుతూ..సోలార్‌తో నడిచే ఈ వాహనానికి దేశీయంగా డిమాండ్ ఉంటుందని ఆశిస్తున్నట్లు, వచ్చే ఏడాది మధ్య నుంచి కమర్షియల్ ఉత్పత్తిని ప్రారంభించాలనుకుంటున్నట్లు చెప్పారు. ఈ వాహనాన్ని బుకింగ్ చేసుకున్న కస్టమర్లు ఇంచుమించు రెండేండ్లు వేచిచూడాల్సి ఉంటుంది. వచ్చే ఏడాది చివరి నుంచి డెలివరీ చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ వాహనాలు కేవలం పుణె, బెంగళూరు నగరాల్లో మాత్రమే విక్రయించనున్నట్లు చెప్పారు. మూడు రకాల్లో నివా, స్టెల్లా, వెగా పేర్లతో లభించనున్న ఈ కారు ఈ నెల చివరి నుంచి ముందస్తు బుకింగ్‌లు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

### విన్‌ఫాస్ట్ ప్రీమియం ఈవీ కార్లు

వియత్నాంకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ విన్‌ఫాస్ట్ ఆటో..దేశీయ మార్కెట్లోకి రెండు ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లను విడుదల చేయడానికి సిద్ధమైంది. ఈ ఏడాది చివర్లో అందుబాటులోకి రానున్న వీఎఫ్ 7, వీఎఫ్ 6 మాడళ్లు కస్టమర్ల అభిరుచికి తగ్గట్టుగా డిజైన్ చేసినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ కార్లను తయారు చేయడానికి తమిళనాడులో 500 మిలియన్ డాలర్ల పెట్టుబడితో ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు విన్‌ఫాస్ట్ ఆసియా సీఈవో ఫామ్ సన్హా చౌ తెలిపారు. ఈ ఏడాది చివరినాటికి అందుబాటులోకి రానున్న ఈ ప్లాంట్‌తోపాటు కార్లను కూడా ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు.

### మోంత్రా ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాలు

దేశీయ మార్కెట్లోకి ఎలక్ట్రిక్ చిన్న కమర్షియల్ వాహనాలతోపాటు మూడు చక్రాల వాహనాలను సైతం అందుబాటులోకి తీసుకొచ్చింది మోంత్రా ఎలక్ట్రిక్. 3.5 టన్నుల సరుకును తీసుకెళ్లే ఈ ఎవియేటర్ కమర్షియల్ వాహనాన్ని ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించింది. కేవలం 15 నిమిషాల్లోనే పూర్తిగా రీచార్జికానున్న ఈ మూడు చక్రాల వాహనం వ్యక్తిగత వ్యవస్థాపకులకోసం తీర్చిదిద్దినట్లు వెల్లడించింది.

### న్యూమరస్ ఈ-స్కూటర్

బెంగళూరుకు చెందిన ఈవీ స్కూటర్ల తయారీ సంస్థ న్యూమరస్ మోటర్స్..దేశీయ మార్కెట్లోకి రూ.1.09 లక్షల విలువైన ఈ-స్కూటర్ డిప్లాస్ మ్యాక్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. సింగిల్ చార్జింగ్‌తో 140 కిలోమీటర్లు ప్రయాణించే ఈ స్కూటర్ గంటకు 63 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్నది. 3 నుంచి 4 గంటలలోపే బ్యాటరీ పూర్తిస్థాయిలో రీచార్జికానున్నది. ప్రస్తుతం 14 నగరాల్లో మాత్రమే వాహనాలను విక్రయిస్తుండగా, వచ్చే ఆర్థిక సంవత్సరం చివరినాటికి వీటి సంఖ్యను 170కి పెంచుకోనున్నట్లు ప్రకటించింది.

### ఎకా ఎలక్ట్రిక్ ట్రక్కు

విద్యుత్‌తో నడిచే కమర్షియల్ వాహన తయారీ సంస్థ ఎకా మొబిలిటీ..తాజాగా ఎలక్ట్రిక్ ట్రక్కు, ఆరుగురు కూర్చోవడానికి వీలుండే రవాణా వాహనాన్ని సైతం ఆవిష్కరించింది. ఎకా 55టీ పేరుతో పిలిచే ఈ ఎలక్ట్రిక్ హెవీ-డ్యూటీ ట్రక్కు సింగిల్ చార్జింగ్‌తో 200 కిలోమీటర్లు, 43 వేల కిలోల లోడ్ కెపాసిటీ, ఫాస్ట్-చార్జింగ్ సదుపాయంతో తయారు చేసింది. దేశీయ ఆటోమొబైల్ రంగంపై తమకున్న కమిట్‌మెంట్‌కు ఈ నూతన వాహనాలు నిదర్శనమని, తాజాగా ఎలక్ట్రిక్ బస్సులు, ట్రక్కులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

# ఢిల్లీ మరోసారి ఆప్‌కు దక్కేనా!



నాలుగోసారి ఢిల్లీ ఎన్నికల బరిలో దిగుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ మరోమారు సీఎం కుర్చీపై కన్నేశారు. పదకొండేండ్ల క్రితం 2013లో తొలిసారి పోటీ చేసి మెజారిటీ రాకున్నా ఆయన సీఎం అయ్యారు. అయితే, 48 రోజులు మాత్రమే అధికారంలో ఉన్నారు. ఆ తర్వాత వరుసగా 2015, 2020 ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించారు. అయితే, ఈసారి మాత్రం బీజేపీ రూపంలో ఆయనకు పెనుసవాలు ఎదురుకాబోతున్నది. ఫిబ్రవరి 5న జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ అన్ని అస్త్రాలను సిద్ధం చేసుకొని పెట్టుకున్నది. 1998 డిసెంబర్‌లో ఓడిన తర్వాత బీజేపీ ఇప్పటివరకు అక్కడ అధికారంలోకి రాలేకపోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధిస్తున్నా ఢిల్లీ సీఎం పీఠం మాత్రం ఆ పార్టీకి అందని ద్రాక్షగా మారింది. ఈ నేపథ్యంలో ఈసారి గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నది. 'ఆప్' ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తున్నది. ఇక, 1998-2013 మధ్య 15 ఏండ్లపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఒక్క సీటూ గెలువలేకపోయింది. మరోవైపు, అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా విజయాలు సాధిస్తున్న 'ఆప్'కు పార్లమెంటు ఎన్నికలు మాత్రం కొరుకుడుపడటం లేదు. ఏడు స్థానాల్లో ఒక్కటంటే ఒక్క దాంట్లోనూ విజయం సాధించలేక చతికిలపడుతున్నది. గత ఎన్నికల్లో విజయం సాధించిన కేజ్రీవాల్‌ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బందులు పెడుతూ వస్తున్నది. కేంద్రపాలిత ప్రాంతంగా ఉన్న ఢిల్లీలో అంతంత మాత్రంగానే ఉండే అధికారాలను కూడా అడ్డుకుంటున్నది. తనకు అనుకూలమైన లెఫ్టినెంట్ గవర్నర్లను నియమించుకొని అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నది. 'ఆప్'లో నంబర్ టూగా పరిగణించే ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను అవినీతి కేసులో నెలలపాటు నిర్బంధించింది. మరోవైపు ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను కూడా అరెస్ట్ చేసి జైలుకు పంపింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు అరెస్ట్ అయిన ఆయన 5 నెలలపాటు జైలులో గడిపారు. బెయిలుపై బయటకు వచ్చాక సెప్టెంబర్ 17న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి క్యాబినెట్‌లో కీలక సభ్యురాలు ఆతిశీ మార్లెనాకు ప్రభుత్వ పగ్గాలు అప్పగించారు. కేజ్రీవాల్‌కు అత్యంత నమ్మకస్థురాలు, విధేయురాలైన మంత్రిగా పనిచేసిన ఆమె నేతృత్వంలోని 'ఆప్' సర్కారు పాత సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొత్త వాటిని ప్రకటించింది. వాటిలో ముఖ్యమైనది 'ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన'. ఈ పథకం కింద అర్హులైన మహిళలకు ప్రతినెల రూ. 1000 చొప్పున అందిస్తారు. కాంగ్రెస్, బీజేపీ కూడా ఇలాంటి నగదు బదిలీ పథకాలనే పోటాపోటీగా ప్రకటించాయి. ప్రజా సంక్షేమ పథకాలతోపాటు విద్య, వైద్య రంగాల్లో పేద, దిగువ మధ్య తరగతి ప్రజలకు చేసిన మేలు కారణంగా ఈ ఎన్నికల్లో సైతం విజయంపై 'ఆప్' ధీమాగా ఉన్నది. అయితే, రాజకీయ పండితులు మాత్రం ఈ అసెంబ్లీ ఎన్నికలు పాలకపక్షమైన 'ఆప్'కు అత్యంత కఠిన పరీక్షగా మారనున్నాయని అంచనా వేస్తున్నారు. 'ఆప్' అగ్రనేతల్లో చాలామంది నిన్నమొన్నటి వరకు వివిధ అవినీతి కేసుల్లో నిర్బంధంలో ఉన్నారు. అయినా, కేజ్రీవాల్ దూకుడు, పోరాట పటిమతో ఎన్నికల ప్రచారంలో జాతీయపక్షాలైన బీజేపీ, కాంగ్రెస్ కన్నా చాలా ముందున్నట్టు కనిపిస్తున్నది. ఇప్పటికే అన్ని సీట్లకూ ఆప్ తమ అభ్యర్థులను ప్రకటించింది. 29 స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల జాబితా విడుదల చేశారు. గతంలో 15 ఏండ్లపాటు అధికారంలో ఉన్నా దేశంలోని మిగతా ప్రాంతాల్లో మాదిరిగానే హస్తినలో కూడా జనం మద్దతును కాంగ్రెస్ కోల్పోయింది. గత పదేండ్లుగా ఢిల్లీ అసెంబ్లీలో ఒక్క ఎమ్మెల్యే కూడా లేని ఈ జాతీయపక్షం గతమెంతో ఘనమనే భ్రమల నుంచి ఇంకా బయటపడటం లేదు. ఒంటరి పోరుకు భయపడుతున్న ఈ పార్టీ చివరి క్షణంలోనైనా 'ఆప్'తో పొత్తు కుదరకపోతుందా అనే ఆశతో కాలం గడుపుతున్నది. కిందటి లోక్‌సభ ఎన్నికల్లో ఆప్-కాంగ్రెస్ పొత్తు మంచి ఫలితాలు ఇవ్వకపోగా 'ఆప్'కు నష్టదాయకంగా మార్చింది. పొరుగున్న ఉన్న హరియాణాలో మాదిరిగానే ఆప్, కాంగ్రెస్ మధ్య ఢిల్లీలో పొత్తు ఉండదని కేజ్రీవాల్ ఇది వరకే ప్రకటించారు. ఈడీ, సీబీఐలను 'ఆప్' నేతలపై ఆయుధాలుగా వాడిన బీజేపీ విషయానికి వస్తే కేజ్రీవాల్ మళ్లీ అధికారంలోకి రాకుండా అన్ని ప్రయత్నాలూ చేస్తున్నది. ఒకవేళ 'ఆప్' గతంలో మాదిరిగా భారీ మెజారిటీతో గెలిచినా ఆ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రి కావడానికి న్యాయపరమైన చిక్కులున్నాయా? లేవా? అనే విషయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో కాస్త కోలుకుందనుకున్న కాంగ్రెస్ ఇటీవలి హరియాణా, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో చావు దెబ్బతిన్న కారణంగా ఢిల్లీ రేసులో అసలు ఉందా? అనే అనుమానం వస్తున్నది. 'ఫిర్ లాయేంగే కేజ్రీవాల్' (కేజ్రీవాల్‌ను మళ్లీ గద్దెనెక్కిద్దాం) అనే ఆమ్ ఆద్మీ పార్టీ నినాదానికి, 'బదల్ కే రహేంగే' (పాలకపక్షాన్ని మార్చేద్దాం) అనే బీజేపీ పిలుపు మధ్య జరుగుతున్న ప్రజా సమరంలో గెలుపు ఎవరిదో వచ్చే ఫిబ్రవరి 8న జరిగే ఓట్ల లెక్కింపుతో తేలిపోతుంది.

# జీవితంలో మీకు అసలు గుండె పోటు రావొద్దంటే ఇలా చేయండి



ఒకప్పుడు కేవలం వయస్సు మీద పడిన వారికి మాత్రమే గుండె పోటు వచ్చేది. కానీ ఇప్పుడు చాలా చిన్న వయస్సులో ఉన్నవారు కూడా గుండె పోటు బారిన పడి ప్రాణాలను కోల్పోతున్నారు. ప్రస్తుతం గుండె పోటు అనేది కామన్ అయిపోయింది. అయితే ఇది చాప కింద నీరులా విస్తరిస్తుండడంతో ప్రతి ఒక్కరు తమ గుండె ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. కచ్చితంగా గుండె ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే గుండె పోటు బారిన పడతారు. అయితే కొన్ని రకాల సూచనలు పాటిస్తే గుండె పోటు రాకుండా ఉండవచ్చు. హార్ట్ ఎటాక్ రాకుండా ముందుగానే నియంత్రించవచ్చు. ఇక అందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

### కొలెస్ట్రాల్ స్థాయిలు..

మీ శరీరంలో కొవ్వు స్థాయిలు ఎల్లప్పుడూ నియంత్రణలో ఉండేలా చూసుకోండి. ముఖ్యంగా కొలెస్ట్రాల్ 130 మిల్లీగ్రాముల కన్నా తక్కువ ఉండేలా చూసుకోండి. లేదంటే రక్త నాళాల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోయి రక్త సరఫరాకు ఆటంకం ఏర్పడుతుంది. దీంతో బీపీ పెరిగి హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశం ఉంటుంది. కనుక శరీరంలో ఉండే కొలెస్ట్రాల్‌పై దృష్టి పెట్టాలి. కొలెస్ట్రాల్ లెవల్స్ ఎల్లప్పుడూ నియంత్రణలో ఉండేలా చూసుకోవాలి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా కాపాడుకోవచ్చు. అదేవిధంగా మీరు తీసుకునే ఆహారంలో నూనె పదార్థాలు లేకుండా జాగ్రత్త పడండి. నూనె పదార్థాలను అధికంగా తింటే శరీరంలో కొలెస్ట్రాల్ ఎక్కువగా పేరుకుపోతుంది. ఇది హార్ట్ ఎటాక్‌ను కలగజేస్తుంది. కనుక నూనె పదార్థాలను తీసుకోవడం తగ్గించాలి. లేదా పూర్తిగా మానేస్తే ఇంకా మంచిది. దీంతో గుండె పనితీరు మెరుగు పడుతుంది.

### ధూమపానం, మద్యపానం..

ధూమ పానం, మద్యపానం ఆరోగ్యానికి హానికరం. ఈ రెండింటి వల్ల కూడా చాలా మందికి గుండె పోటు వస్తుంది. కనుక ఈ రెండు అలవాట్లకు దూరంగా ఉండాలి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. అదేవిధంగా ప్రస్తుతం చాలా మంది నిత్యం ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. అనుక్షణం ఏదో ఒక రకంగా ఆందోళన చెందుతున్నారు. కానీ వీటిని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. ఒత్తిడి, ఆందోళన అధికంగా ఉంటే హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. కనుక వీటిని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. ఇందుకు గాను మీకు ఇష్టమైన సంగీతం వినడం, పుస్తకాలను చదవడం చేయాలి. లేదా రోజూ ప్రకృతిలో కాసేపు గడిపితే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. దీంతో గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు.

### బీపీ..

బీపీని కూడా కంట్రోల్ లో ఉండేలా చూసుకోవాలి. సాధారణ వ్యక్తులకు బీపీ 120/80 ఉండాలి. ఇంతకన్నా ఎక్కువ లేదా తక్కువగా బీపీ ఉండడం మంచిది కాదు. ఇది హార్ట్ ఎటాక్‌లను కలగజేస్తుంది. కనుక బీపీ ఎల్లప్పుడూ నియంత్రణలో ఉండేలా జాగ్రత్త వహించాలి. అలాగే బరువును కూడా కంట్రోల్‌లో ఉంచాలి. బరువు సరిగ్గా ఉంటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నియంత్రించవచ్చు. బరువును తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. దీంతో ఆరోగ్యంగా ఉండవచ్చు. అలాగే రోజూ కచ్చితంగా వ్యాయామం చేయాలి. శారీరక శ్రమ ఉండేలా చూసుకోవాలి. కనీసం 30 నిమిషాల పాటు అయినా సరే వ్యాయామం చేయాలి. ఇక ఉప్పును కూడా తక్కువగా తినాలి. ఇలా పలు సూచనలను పాటిస్తే గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. దీంతో హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు.

# దుందుడుకు ట్రంప్



అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికై అతి త్వరలో పదవీ బాధ్యతలు చేపట్టబోతున్న డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రకటనలు అంతకంతకూ వివాదాస్పదం అవుతున్నాయి. దేశాల మధ్య సంబంధాల్లో ఉండే దౌత్యపరమైన గౌరవాలు, మర్యాదలు బేఖాతరుకు గురవుతున్న పోకడలు కనిపిస్తున్నాయి. ట్రంప్ ధోరణి నిజానికి మొదటి నుంచీ సంప్రదాయాలకు భిన్నంగానే ఉంటున్నది. అది ఇప్పుడు దుందుడుకు, దుస్సాహసిక వాగ్ధాటితో మరింతగా శ్రుతి మించుతున్నదని చెప్పక తప్పదు. ట్రంప్ విస్తరణవాద తరహాలో మాట్లాడుతుండటం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నది. అమెరికా పొరుగు దేశమైన కెనడాను 51వ రాష్ట్రంగా కలిపేసుకుంటామని ట్రంప్ బాంబు పేల్చారు. కెనడాకు అమెరికా సైనికంగా, ఆర్థికంగా చాలా సాయం చేస్తున్నదనీ, అందుకు బదులుగా ఏమీ పొందడం లేదనీ అంటున్నారు. కెనడాను కలిపేసుకునేందుకు 'ఆర్థిక శక్తి'ని ఉపయోగిస్తామనీ చెప్తున్నారు. కెనడా ఉత్పత్తులపై 25 శాతం టారిఫ్ పెంచుతామనీ బెదిరిస్తున్నారు. దీనిపై కెనడాలో సహజంగానే గగ్గోలు బయలుదేరింది. ఇదిలా ఉండగానే పనామా కాలువ చార్జీలు ఎక్కువగా ఉంటున్నాయనీ, ఆ నౌకా మార్గాన్ని అమెరికా స్వాధీనం చేసుకుంటుందనీ మరో దౌత్య వివాదానికి ట్రంప్ తెరతీశారు. ట్రంప్ చేస్తున్న ప్రతిపాదనలు కొంత హాస్యాస్పదంగానూ ఉంటున్నాయి. ట్రంప్ ప్రకటనలు కొన్ని దేశాల మధ్య ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా గ్రీన్‌ల్యాండ్ వ్యవహారం. ప్రస్తుతం డెన్మార్క్‌లో స్వయంపాలిత ప్రాంతంగా ఉన్న ఆ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ ప్రకటించారు. ఇందుకు సైనికచర్య ఉపయోగించే అవకాశాన్ని కాదనలేమనీ అంటుండటమే అసలు సమస్య. యూరప్‌లో పలుకుబడి కలిగిన జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలు దీనిపై ప్రతికూలంగా స్పందించాయి. దేశాలు చిన్నవైనా, పెద్దవైనా పరస్పర సార్వభౌమాధికారాన్ని గౌరవించుకోవాలని జర్మనీ చాన్సలర్ హితవు చెప్పడం గమనార్హం. అమెరికా నేతృత్వంలోని సైనిక కూటమి నాటోలో జర్మనీ, ఫ్రాన్స్ కీలక సభ్య దేశాలనేది తెలిసిందే. అటు డెన్మార్క్ కూడా గ్రీన్‌ల్యాండ్‌పై తుది నిర్ణయాధికారం అక్కడి ప్రజలదేనని ట్రంప్ ప్రకటనను ఖండించడం వివాదం ముదరడాన్ని సూచిస్తున్నది. నాటోలో ఉక్రెయిన్‌ను చేర్చుకునే ప్రతిపాదనలపైనా ట్రంప్ నీళ్లు చల్లారు. తన పక్కలో బల్లాన్ని రష్యా ఎందుకు అంగీకరిస్తుందని ఆయన చేసిన ప్రకటన అమెరికాలోని ఆయన సమర్థకులను సైతం విస్మయానికి గురిచేసింది. దేశాలను, ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడం గురించే కాకుండా భౌగోళికంగా సుప్రసిద్ధమైన పేరు మార్పిడి మీద కూడా ట్రంప్ ప్రకటనలు చేస్తున్నారు. మెక్సికో అఖాతం పేరు అమెరికా అఖాతంగా మార్చాలని సంచలనం కలిగించారు. పరిపాలన పగ్గాలు చేపట్టక ముందే ధోరణి ఇలా ఉంటే తర్వాత ఇంకెలా ఉంటుందోనని ట్రంప్ గుబులు పుట్టిస్తున్నారు. ఇప్పటికే అనేక యుద్ధాలతో, ఘర్షణలతో ప్రపంచం కునారిల్లుతున్నది. తీవ్ర పర్యవసానాలకు దారితీసే విషయాలపై ట్రంప్ అలవోకగా ప్రకటనలు చేస్తుండటం విశ్వశాంతికి విపత్కరమని చెప్పక తప్పదు. ప్రపంచ పెద్దన్నగా వ్యవహరించాల్సిన ఏకైక అగ్రరాజ్యం ఉద్రిక్తతలకు ఆజ్యం పోయడం ఏ మాత్రం శ్రేయస్కరం కాదు.

# ఇదీ.. రేవంత్ మార్క్ ఎమర్జెన్సీ



గతం వర్తమానాన్ని, వర్తమానం భవిష్యత్తును నిర్దేశిస్తుంది అంటారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ఎమర్జెన్సీ నడుస్తున్నది. గతంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని చూసిన ఈ దేశం నాటి నియంతృత్వం, అరాచకత్వంపై పుంఖానుపుంఖాలుగా చర్చించుకుంటున్నది. వామ్మో.. ఇందిరమ్మ ఇంత దౌర్జన్యమా అనే వేల పుస్తకాలు, లక్షల రచనలు అచ్చయి, నాటి చరిత్రను ఇప్పటికీ సజీవంగా కండ్ల ముందు కదలాడేలా చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తెస్తమన్న రోజే ఇక్కడి బుద్ధి జీవులు ఇందిరమ్మ రాజ్యపు అరాచకాలు, అమానవీయ ఘటనలను గుర్తు చేసుకున్నారు. కానీ, అదే పార్టీలో కొందరు మార్పు, ప్రజాపాలన అని రకరకాల గజకర్ణ, గోకర్ణ విద్యలతో పాటు అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వస్తూనే ఆరు గ్యారెంటీలతో పాటు స్వేచ్ఛా స్వాతంత్ర్యం అనే ఏడో గ్యారెంటీని సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తామని చెప్పారు. నిజానికి, ఆ ఆరు గ్యారెంటీలను పాతరేసి ఆయన ఇప్పుడు ఏడో గ్యారంటీపై ప్రధా న దృష్టిని కేంద్రీకరించినట్టున్నారు. ఇందిరమ్మ రాజ్యాన్ని తలదన్నే తరహాలో తన నిరంకుశ, నియంతృత్వ, అపరిపక్వ పాలనతో నయా ఎమర్జెన్సీ అనే పాలసీని తు.చ. తప్పకుండా అమలు జరిపిస్తున్నరు. వ్యక్తిగత కక్షలు, ప్రతీకారం ఉండదని ప్రమాణం చేసి పదవీ బాధ్యతలు చేపట్టిన ఏడాదిలో ఆయన ఆలోచన పోకడలు చూసి తెలంగాణ సమాజం నివ్వెరబోతున్నది. ప్రధాన ప్రతిపక్ష నేతలను వేటాడి వెంటాడి కేసుల్లో ఇరికిస్తుండటం ఒక ఎత్తయితే, నక్సలైట్లపై కాల్పులు, హత్యలు, ఆత్మహత్యలు, మానభంగాలు, ఆకలిచావులు, విద్యార్థులు విషాహార మారణ హోమాలపై, నిత్యం తల్లడిల్లుతున్న తెలంగాణపై ప్రశ్నిస్తున్న ప్రజాస్వామికవాదులపై కేసులు, నిర్బంధపు ఉచ్చు మరో ఎత్తులా పరిణమిస్తున్నది. ప్రధానంగా అధికారంలోకి వచ్చే ముందు మ్యానిఫెస్టో ద్వారా ఆరు గ్యారెంటీలు, 420 హామీలపై మాట్లాడే ప్రతీ గొంతుకను ఏడో గ్యారెంటీని అడ్డుపెట్టి మరీ కోసేస్తున్నారు. ప్రగతిభవన్ పేరును ప్రజాభవన్‌గా మార్చి గొప్పలు చెప్పుకొంటున్న ప్రభుత్వం నేడు ప్రజాభవన్‌లోకి అం దరినీ స్వేచ్ఛగా అనుమతిస్తున్నదా? ఓ జిల్లా నుంచి ఎవ్వరైనా సచివాలయం వస్తే పోలీస్ నిర్బంధం లేకుండా స్వేచ్ఛగా అనుమతించే పరిస్థితి ఉన్నదా..? సచివాలయం 6వ అంతస్థులోకి కంచెలెందుకే సారు. సీఎంను ఓ సామాన్యుడు గానీ, ఎమ్మెల్యే గానీ అనుమతి లేకుండా కలిసే పరిస్థితి ఉన్నదా%ౌ% ఇలాంటి స్వేయ ప్రశ్నలకు రేవంత్‌రెడ్డి నుంచి సమాధానం రావాలి. ధర్నా చౌక్ నిషేధం ఎత్తివేశామనీ, అదే ఓ పెద్ద విశాలమైన ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని నమ్మబలుకుతున్నారు. కానీ, నిజానికి ధర్నాచౌక్ ఎప్పుడూ నిషేధంలో లేదు. స్వయంగా సీఎం హోదాలో కేంద్రంపై కేసీఆర్ నిరసనకు దిగింది ధర్నా చౌక్ వద్దే. కేసీఆర్ సర్కార్‌లో నిత్యం ధర్నాచౌక్ ఓ ప్రజాస్వామ్య వేదికగా ఉండేది. కానీ, ఇప్పుడు ఏడాదిలో పోలీసు రాజ్యమే నడుస్తున్నది. ఇవాళ ధర్నాచౌక్‌లో ధర్నాలు చేద్దామని దరఖాస్తు చేస్తే సవాలక్ష ఆంక్షలు. ఇటీవల బీసీల కోసం భారత జాగృతి ఆధ్వర్యంలో ధర్నా కోసం దరఖాస్తు చేస్తే కోర్టు మెట్లెక్కాల్సిన దుస్థితి. పౌరహక్కుల సంఘం యాభై ఏండ్ల మహాసభల సందర్భంగా గత మార్చిలో ఊరేగింపు జరపడానికి అనుమతి ఇవ్వలేదు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో జనవరి 13న అంతర్జాతీయ పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన రోజున, ట్యాంక్‌బండ్ మీద మఖ్దూం విగ్రహం దగ్గర ప్రదర్శన జరుపబోతే విపరీతంగా పోలీసులను మోహరించి విద్యార్థి యువజనులను అరెస్టు చేశారు. భువనగిరిలో హైస్కూలు విద్యార్థినులు భవ్య, వైష్ణవిల అనుమానాస్పద మరణాలపై సరైన దర్యాప్తు కోరుతూ చైతన్య మహిళా సంఘం ధర్నా తలపెడితే పోలీసులు దాన్ని విచ్ఛిన్నం చేశారు. హైదరాబాద్ గాంధీనగర్‌లో గ్రూపు పరీక్షలకు తయారవుతున్న ఒక నిరుద్యోగ యువతి ఆత్మహత్య చేసుకుంటే, అక్కడ చేరిన నిరుద్యోగులు ఆందోళనకు దిగకుండా చెదరగొట్టారు. హైదరాబాద్ శివార్లలో ఒక చర్చిని మతోన్మాదులు ధ్వంసం చేసిన ఘటనలో సమస్యను పరిష్కరించకపోగా, తమ సమస్యలు చెప్పుకోవడానికి ప్రయత్నించిన బాధితులనే అడ్డుకున్నారు. ఏడాదిలో ఆధిపత్య శక్తులకు వ్యతిరేకంగా వార్తలు రాసినందుకు జర్నలిస్టుల మీద దాడుల వార్తలు వస్తూనే ఉన్నాయి. శాసనసభలో మీడియా పాయింట్ దగ్గర ప్రతిపక్ష సభ్యులు మాట్లాడకుండా అడ్డుకున్నారు. నల్లగొండ జిల్లా చింతపల్లి పోలీసుస్టేషన్‌లో గిరిజన యువకుడి లాకప్‌డెత్ జరిగింది. ఏడాదిలోనే మంత్రి సీతక్క ఇలాఖాలోనే మూడు ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఇక ఎన్ఐఏ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు, పొరుగు రాష్ట్రాల పోలీసుల సోదాలు, దాడులు, మనుషులను ఎత్తుకుపోవడం నిత్యకృత్యమవుతున్నాయి. జైలు నిర్బంధంలో ఉన్న లగచర్ల రైతులకు బేడీలు, ఫార్మా కంపెనీల పేరుతో భూములను లాక్కోవడం వంటి ఘటనలూ సహజమైపోతున్నాయి. ఇక తన పాలనలో రాష్ట్రం పూర్తిగా నేరమయమైపోయిందనడానికి తాజాగా తెలంగాణ డీజీపీ జితేందర్‌రెడ్డి విడుదల చేసి వార్షిక క్రైం రేట్ లెక్క లే నిదర్శనం. 2,945 అత్యాచారాలు, 241 హత్యలు, 379 ఆత్మహత్యలతో ఓవరాల్ క్రైం రేటు దాదాపు 10 % పెరిగింది. గతేడాది 2,13, 121 కేసులు నమోదైతే, 2024లో 2,34,158 కేసులు నమోదయ్యాయి. ఇక సైబర్ క్రైం గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయింది. వీటన్నింటిపై అజమాయిషీగా నిర్వహించాల్సిన ప్రభుత్వం చేష్టలుడిగి వ్యవహరిస్తూ కేవలం ప్రధాన ప్రతిపక్ష నేతలనే టార్గెట్ చేస్తున్నది. పదే పదే ఇందిరమ్మ రాజ్యం అంటున్న ఈ సర్కారులో పోలీస్ రాజ్యమే నడుస్తున్నది. ఆరు గ్యారెంటీలపై ప్రశ్నిస్తున్న ప్రధాన ప్రతిపక్ష నేతలను సీఎం రేవంత్ టార్గెట్ చేసి కేసుల్లో ఇరికిస్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై 10 కేసులు నమోదు చేసి అరెస్ట్ సాకుల కోసం అనేక రకాలుగా రంధ్రాన్వేషణ సాగిస్తున్నారు. కేసీఆర్‌పై రాజకీయ కక్ష పెంచుకొని రాజకీయాలను పూర్తిగా ప్రతీకారాత్మకంగా మార్చేయడం గమనార్హం. బీఆర్ఎస్ సీనియర్ నేత, ఫైర్ బ్రాండ్ హరీశ్‌రావు గొంతు నొక్కే ప్రయత్నం అడుగడుగునా జరుగుతున్నది. ఆయనపై ఆరు కేసులు నమోదు చేసి రాక్షసానందం పొందుతున్నారు. సిద్దిపేటలో బీఆర్ఎస్ ఆఫీస్‌పై దాడి చేయడమే కాకుండా, ఎక్కడ ఏ ఘటన జరిగినా, ఎవ్వరే కేసుల్లో ఇరుకున్నా హరీశ్‌నే రోజూ గృహ నిర్బంధం చేయడం పరిపాటిగా మారింది. సీఎం రేవంత్ తన పాలనా కాలమంతా కేటీఆర్ అరెస్ట్, హరీశ్‌పై కేసులు, మాజీ సీఎం కేసీఆర్ పై విచారణలకే కేటాయిస్తుండటం తెలంగాణ సమాజం నిశితంగా గమనిస్తున్నది. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహా ఎర్రోళ్ల శ్రీనివాస్ వంటి ఉద్యమకారులపై కావాలని కేసులు పెట్టి సెలవు రోజుల్లో అరెస్టు చేస్తూ సీఎం వికృత ఆనందాన్ని పొందుతున్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో ఏ వర్గమూ సంతోషంగా లేదనడానికి అనేక ఉదాహరణలున్నాయి. రైతులను ఈ సర్కారు మోసం చేసిందనడానికి రైతు రుణమాఫీ, రైతు భరోసాలే ప్రత్యక్ష ఉదాహరణలు. కేసీఆర్ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన రైతుబంధు దేశవ్యాప్తంగా ఒక రోల్ మాడల్‌గా నిలిచింది. దీని పేరును రైతు భరోసాగా మార్చి ఏడాదికి 10 వేలు కాకుండా 15 వేలు ఇస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలందరూ ప్రజల దగ్గరకు వెళ్లి పదే పదే చెప్పారు. వరంగల్‌లో జరిపిన భారీ బహిరంగ సభలో రైతు డిక్లరేషన్ పేరిట 15 వేలు ఇస్తామని రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాహుల్‌గాంధీ మాత్రమే కాదు, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే వంటివారు కూడా పాల్గొన్న ప్రతి సభలో రూ.15 వేలు ఇస్తామని చెప్తూనే వచ్చారు. ఇక ప్రగల్భాల రేవంత్‌రెడ్డి అయితే 'కేసీఆర్ ఇచ్చే ముష్టి 10 వేలు ఎందుకు? మా ప్రభుత్వం రాగానే ఎకరాకు 15 వేలు ఇస్తామని' ఊరూరా తిరిగారు. రాహుల్‌గాంధీ సహా కాంగ్రెస్ అగ్రనేతలందరూ చెప్తున్నారు కాబట్టి అమలు చేస్తారని ప్రజలు అమాయకంగా వీరి మాటలు నమ్మారు. దగా చేయటం కాంగ్రెస్ డీఎన్ఏలో ఉన్నదనే విషయాన్ని తెలంగాణ రైతాంగం మర్చిపోయింది. ఎన్నికలు అయిన తర్వాత వాయిదాల పర్వం ప్రారంభమైంది. సోనియాగాంధీ పుట్టినరోజుకు కానుకగా ఇస్తామన్నారు. రాష్ట్రానికి అప్పులు ఉన్నాయి కాబట్టి తర్వాత ఇస్తామన్నారు. వాయిదాలు వేసి వేసి ఇప్పుడు రూ.15 వేలు కాదు, రూ.12 వేలు మాత్రమే ఇస్తామని రేవంత్‌రెడ్డి సర్కారు నిసిగ్గుగా ప్రకటించింది. అది కూడా వ్యవసాయయోగ్యమైన భూములకు అని కొందరు మంత్రులు బహిరంగంగా చెప్తున్నారు. కానీ, వ్యవసాయ యోగ్యమైన భూములంటే ఏమిటో చెప్పటం లేదు. అంతేకాదు, సాధారణంగా రైతులకు వానకాలం నాట్లకు పెట్టుబడులు అవసరమవుతాయి. ఆ సమయంలో ప్రభుత్వం భరోసా ఇవ్వకుండా రూ.11 వేల కోట్లు ఎగ్గొట్టింది. ఇప్పుడు యాసంగిలో షరతులతో కూడిన పంపిణీ చేస్తానంటున్నది. తెగించి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కాపాడుకునేందుకు కాంగ్రెస్ కబంధహస్తాల నుంచి బయటపడేవరకు ఎత్తిన పిడికిలి దించకుండా కాంగ్రెస్ పోకడలపై యుద్ధానికి సిద్ధం కావాలి. తెలంగాణ మట్టి బిడ్డలకు తెలంగాణ తల్లి ఉగ్గుపాలతోనే ప్రశ్నించడం నేర్పింది. ప్రపంచంలో ఎన్నో విప్లవ సామాజిక ఉద్యమాలకు నాయకత్వం వహిస్తుంది నేటికీ తెలంగాణ బిడ్డలే. వర్గ పోరాటమైనా, వర్ణ పోరాటమైనా భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం ప్రపంచంలోనే పోరాటం చేసిన చరిత్ర తెలంగాణకున్నది. ఇట్లా కొట్లాడిన తెలంగాణ బిడ్డలను ప్రశ్నిస్తే అరెస్టు చేస్తా, ప్రశ్నిస్తే జైలుకు పంపిస్తా అంటే తెలంగాణ సమాజం ఎన్నిసార్లు జైలుకెళ్లడానికైనా, ఎన్నిసార్లు కేసులు ఎదుర్కోవడానికైనా సిద్ధంగా ఉన్నదని తెలుసుకోవాలి తెలంగాణ సర్కారు పెద్దలు. ప్రజా పరిపాలన అని చెప్పి ఈ రోజు తెలంగాణలో రేవంత్ ఎమర్జెన్సీ నడుస్తున్నది. నాడు దేశంలో ఇందిరమ్మ ఎమర్జెన్సీ, నేడు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ఎమర్జెన్సీ.. బుద్ధిజీవులు, శ్రమజీవులు, శ్రామికులు, విద్యార్థులు, యువకులు ప్రశ్నించాల్సిన మోకా వచ్చింది.



# మరణం మరింత దూరం

**క్రయోప్రిజర్వేషన్ వ్యవస్థ అభివృద్ధి**

**ప్రాణాంతక వ్యాధులు ఉన్న వారిని ఇందులో సంరక్షించే అవకాశం**

ప్రాణాంతక వ్యాధుల బారిన పడ్డ వారి ఆయుష్షు పెంచేందుకు ఉపయోగపడే ప్రపంచంలోని మొదటి క్రయోప్రిజర్వేషన్ వ్యవస్థను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఏఐ శాస్త్రవేత్త, యాంటీ ఏజింగ్ పరిశోధకుడు డాక్టర్ అలెక్స్ ఝూవోరోన్కోవ్, మాలిక్యూలర్ బయాలజిస్ట్ హషేమ్ అల్ ఘైలి కలిసి 'టైమ్‌షిఫ్ట్' పేరుతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశారు. ప్రాణాంతక వ్యా ధుల బారిన పడ్డ వారిని ఈ క్రయోప్యాడ్‌లలో పెడితే వారి ఆరోగ్యం మరింత క్షీణించకుండా చూడొచ్చని, వారి న్యూరోడీజెనరేటివ్ వ్యాధులు, క్యాన్సర్ల అభివృద్ధిని తగ్గించవచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. కొన్నేండ్ల పాటు మనుషులను వీటిల్లో పెట్టవచ్చని, తద్వారా వారికి అందించాల్సిన చికిత్సను అభివృద్ధి చేసేందుకు పరిశోధకులకు సమయం లభిస్తుందని తెలిపారు. ఈ క్రయోప్యాడ్‌లలో -196 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. ఇంత తక్కువ ఉష్ణోగ్రతలో మంచు ఏర్పడకుండా కొన్ని గ్యాస్‌లను, క్రయోప్రొటెక్టన్స్‌లను వాడతారు. సాధారణంగా మృతదేహాన్ని ఎక్కువకాలం భద్రపరచడానికి ఇలా తక్కువ ఉష్ణోగ్రతల్లో భద్రపరుస్తారు. తాము మొదటిసారి జీవించి ఉన్న మనుషులను కాపాడేందుకు ఈ క్రయోప్యాడ్‌లను తయారుచేసినట్లు శాస్త్రవేత్తలు చెప్పారు. మనిషి ఈ ప్యాడ్‌లో ఉన్నప్పుడు వారి సన్నిహితులు మాట్లాడటానికి ఒక ఏఐ ఆధారిత అవతార్‌ను సైతం తయారు చేస్తామని తెలిపారు.




## ఘట్టమనేని అబ్బాయి.. రవీనా టాండన్ అమ్మాయి..



# ఫోటో దిగితే పెళ్లి చేసేస్తారా? పెళ్లి రూమర్లపై త్రిష అసహనం

త్రిష ఇప్పటికీ పెళ్లి చేసుకోకపోవడంతో ఎప్పటికప్పుడు ఆమె పెళ్లి గురించి సోషల్ మీడియాలో వార్తలొస్తూనే ఉంటుండగా, ఈ మధ్య ఆ వార్తలు మరీ ఎక్కువయ్యాయి.

హీరోయిన్ త్రిష కృష్ణన్ కు ఉన్న క్రేజ్ గురించి కొత్తగా చెప్పనక్కర్లేదు. దాదాపు 20 ఏళ్లుగా సినీ ఇండస్ట్రీలో ఉన్న త్రిష ఇప్పటికీ యంగ్ హీరోయిన్లతో సమానంగా పోటీ పడి, విభిన్న పాత్రలతో ఆడియన్స్ ను అలరిస్తూ వస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో ఇప్పటికీ బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్న త్రిష నాలుగు పదుల వయసు దాటినా ఇంకా పెళ్లి చేసుకోలేదు. త్రిష పెళ్లిపై కొన్నాళ్లుగా రూమర్లు త్రిష ఇప్పటికీ పెళ్లి చేసుకోకపోవడంతో ఎప్పటికప్పుడు ఆమె పెళ్లి గురించి సోషల్ మీడియాలో వార్తలొస్తూనే ఉంటుండగా, ఈ మధ్య ఆ వార్తలు మరీ ఎక్కువయ్యాయి. త్రిష ఓ స్టార్ హీరోతో ప్రేమలో ఉందని, త్వరలోనే అతన్ని పెళ్లి చేసుకోబోతుందని అంతేకాకుండా త్రిష రాజకీయాల్లోకి కూడా వస్తుందని వార్తలొస్తున్న నేపథ్యంలో ఈ వార్తలపై త్రిష రియాక్ట్ అయ్యారు. వాళ్లిద్దరి మధ్యలో రాజా మళ్లీ మొదటికా! ఇలాంటివి చూస్తుంటే అసహ్యంగా ఉంది తన పెళ్లి, రాజకీయ అరంగేట్రం గురించి వస్తున్న వార్తల్లో ఏ మాత్రం నిజం లేదని త్రిష క్లారిటీ ఇచ్చారు. ఫ్రెండ్స్ తో దిగిన ఫోటోలను వేరేలా భావించి, దానికి అవాస్తవ కథనాలను జోడించి ప్రచారం చేస్తున్నారని, నేను ఎవరితో ఫోటో దిగితే వారితో పెళ్లి జరిగినట్టేనా? ఇంకా ఎంతమందితో నా పెళ్లి చేస్తారంటూ అం గోపీచంద్ ఎగ్జిట్ తో అతడొచ్చాడా? పెళ్లి వార్తలపై స్వయంగా త్రిష క్లారిటీ ఇవ్వడంతో ఇప్పటికైనా ఈ రూమర్లు ఆగుతాయేమో చూడాలి. ఇక అమ్మడి కెరీర్ విషయానికొస్తే త్రిష చాలా కాలం తర్వాత తెలుగు సినిమాలోకి రీఎంట్రీ ఇస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి హీరోగా యంగ్ డైరెక్టర్ వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న విశ్వంభర మూవీలో త్రిష హీరోయిన్ గా నటిస్తున్నారు. సుమారు రూ.150 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ సోషియో ఫాంటసీ మూవీ వచ్చే ఏడాది సమ్మర్ లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

RX 100', 'మహాసముద్రం' లాంటి ఇంటెన్స్, రా సినిమాలు తీయడంలో దర్శకుడు అజయ్ భూపతిది ప్రత్యేక శైలి.

100', 'మహాసముద్రం' లాంటి ఇంటెన్స్, రా సినిమాలు తీయడంలో దర్శకుడు అజయ్ భూపతిది ప్రత్యేక శైలి. ఆయన ఇప్పుడు తన నాలుగో సినిమా 4 కోసం ప్లాన్ సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్ట్ కొద్ది వారాల క్రితమే ప్రకటించినా, అసలు సస్పెన్స్ మాత్రం హీరో, హీరోయిన్ల గురించే నడిచింది. ఇప్పుడు ఆ సస్పెన్స్‌కు తెరదించుతూ, టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న ఇద్దరు క్రేజీ స్టార్ కిడ్స్‌ను మేకర్స్ అధికారికంగా పరిచయం చేశారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా నేషనల్ సెన్సేషన్ రషా థడానీని స్వాగతిస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈమె 90ల నాటి స్టార్ హీరోయిన్ రవీనా టాండన్, ప్రముఖ నార్త్ ఇండియన్ డిస్ట్రిబ్యూటర్ అనిల్ థడానీల కుమార్తె. ఇప్పటికే 'ఆజాద్' అనే హిందీ చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన రషా, ఉయ్ అమ్మా పాటతో సోషల్ మీడియాను షేక్ చేసింది. విడుదల చేసిన పోస్టర్‌లో రషా ఒక బైక్‌పై చాలా స్టైలిష్, రగ్డ్ లుక్‌లో కనిపించడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. వాళ్లిద్దరి మధ్యలో రాజా మళ్లీ మొదటికా! ఇక ఈ సినిమాతో తెలుగు తెరకు పరిచయం అవుతున్న హీరోది కూడా ఇండస్ట్రీలో చాలా పెద్ద బ్యాక్‌గ్రౌండ్. సూపర్ స్టార్ కృష్ణ గారి మనవడు, దివంగత రమేష్ బాబు గారి కుమారుడు అయిన జయ కృష్ణ ఘట్టమనేని ఈ సినిమాతో హీరోగా అరంగేట్రం చేస్తున్నాడు. ఇలా ఘట్టమనేని మూడో తరం వారసుడు, రవీనా టాండన్ కూతురు కలిసి నటిస్తుండటం ఈ ప్రాజెక్ట్‌కు అతిపెద్ద హైలైట్‌గా నిలిచింది. దర్శకుడు అజయ్ భూపతి ఈ చిత్రాన్ని తన మార్క్ స్టైల్‌లో ప్లాన్ చేశారు. ఇది ఒక ఇంటెన్స్ లవ్ స్టోరి అని కొండల నడుమ చాలా సహజంగా సాగుతుందని చిత్ర బృందం తెలిపింది. ముఖ్యంగా, తన సినిమాల్లో హీరోయిన్ పాత్రలను చాలా బలంగా రాసుకునే అజయ్ భూపతి, ఈ సినిమాలో కూడా రషా థడానీ కోసం ఒక పవర్‌ఫుల్, ఇంటెన్స్ రోల్‌ను సిద్ధం చేశారని సమాచారం. గోపీచంద్ ఎగ్జిట్ తో అతడొచ్చాడా? ఈ భారీ డెబ్యూ ప్రాజెక్ట్‌కు టాలీవుడ్‌లోని ఇద్దరు దిగ్గజ నిర్మాతల అండ దొరికింది. లెజెండరీ ప్రొడ్యూసర్ సి. అశ్విని దత్ (వైజయంతీ మూవీస్) ఈ చిత్రాన్ని సమర్పిస్తుండగా, 'చందమామ కథలు' బ్యానర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్నారు. ఈ కాంబినేషన్ చూస్తుంటే, ఇది డెబ్యూ సినిమా అయినా నిర్మాణ విలువలు ఏమాత్రం తగ్గకుండా భారీగా ఉండనున్నాయి. ఈ కొత్తతరం ప్రేమకథ రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభం కానుంది. సినిమా అసలు టైటిల్‌ను, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. ఇక స్టార్ కిడ్స్, స్టార్ డైరెక్టర్, స్టార్ ప్రొడ్యూసర్స్ కలయికలో వస్తున్న ఈ సినిమా రాబోయే అప్డేట్స్ తో ఎలాంటి హైప్ ని క్రియేట్ చేస్తుందో చూడాలి.

## నాగార్జున ఫ్యామిలీ మెంబెర్ డిజిటల్ అరెస్ట్.. కింగ్ షాకింగ్ కామెంట్స్!





పైరసీ వెబ్ సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. నేపథ్యంలో సినీపెద్దలు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్టార్ నటుడు, నిర్మాత అక్కినేని నాగార్జున మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేశారు. అవును... పైరసీ వెబ్ సైట్ ఐబొమ్మ నిర్వాహకుడి వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ వెబ్ సైట్ వెనకున్న మాస్టర్ మైండ్ ఇమ్మడి రవి వద్ద ఉన్న హార్డ్ డిస్క్ లో సుమారు 21 వేల సినిమాలు ఉన్నాయని హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించడం షాకింగ్ గా మారింది. అనంతరం అక్కినేని నాగార్జున మీడియాతో మాట్లాడారు. ప్రభాస్ కొత్త లుక్స్.. దేనికోసం? ఈ సందర్భంగా... ఐబొమ్మతో సినిమా పైరసీ అనేది కేవలం రూ.20 కోట్ల కోసం చేసిన పని కాదని.. దీని వెనుక అంతర్జాతీయ రాకెట్, అంతర్జాతీయ మోసం ఉందని తెలిపారు. అతని వద్ద 50 లక్షల మంది సబ్ స్క్రైబర్స్ ఉన్నారని సీపీ సజ్జనార్ తెలిపారని.. అంటే వారందరి పర్సనల్ డేటా పూర్తిగా వాళ్ల వద్ద ఉన్నట్లేనని అన్నారు. ఈ నేపథ్యంలో తన కుటుంబంలో జరిగిన షాకింగ్ విషయాన్ని పంచుకున్నారు. ఇందులో భాగంగా... సుమారు ఆరేడు నెలల క్రితం తన కుటుంబ సభ్యుల్లో ఒకరిని ఆల్ మోస్ట్ రెండు రోజులు డిజిటల్ అరెస్ట్ చేశారని నాగార్జున తెలిపారు. దీని వెనుకున్న వ్యవస్థ పక్కాగా పని చేస్తుందని.. ఇందులో తొలుత ట్రాప్ చేస్తారని, బలహీనతలు తెలుసుకుంటారని.. ఈ క్రమంలో క్రెడిట్ కార్డ్ వివరాలతో పాటు అన్ని వివరాలు సంపాదిస్తారని అన్నారు. పైరసీ లో సినిమాలు చూపించడం అనేది బిగ్ ట్రాప్ అని తెలిపారు. హనీ రోజ్ 'రాహేలు' ట్రైలర్.. చీకట్లో ఎరుపెక్కిన కళ్ళు వెతకాలి..! తన ఇంట్లో ఫ్యామిలీ మెంబర్ కీ ఈ సమస్య ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించినట్లు నాగార్జున తెలిపారు. దీంతో పోలీసులు లైన్ లోకి రాగానే.. డిజిటల్ అరెస్ట్ కు ప్రయత్నించినవాళ్లు వెంటనే మాయమైపోయారని అన్నారు. అయితే, తర్వాత వాళ్లను ట్రేస్ చేయడం కుదరలేదని.. వాళ్లు అంత పగడ్బందీగా ఉన్నారని నాగ్ వివరించారు. పైరసీ సినిమా వెబ్ సైట్ నిర్వాహకులు.. జనాలకు ఏదో ఉచితంగా సినిమాలు చూపించాలని కాదని, దీని వెనుక బిగ్ ప్లాన్ ఉంటుందని, ఇందులో భాగంగా వేల కోట్ల రూపాయలు సంపాదన లక్ష్యం ఉంటుందని, ఇమ్మడి రవి వద్ద దొరికిన రూ.3 కోట్లు వాళ్ల సంపాదనలో 'చిల్లర' అని నాగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## ఆంధ్ర కింగ్ తాలూకా.. రామ్ కాన్ఫిడెన్స్ ఏ లెవెల్లో ఉందంటే..



'ఇస్మార్ట్ శంకర్' తర్వాత రామ్ పోతినేని నుంచి వస్తున్న ప్రతీ సినిమాపై అంచనాలు భారీగానే పెరుగుతున్నాయి. ఎందుకంటే అతను ప్రతీ సినిమాతో కొత్త తరహా ఎంటర్టైన్మెంట్ ప్లాన్ చేస్తున్నాడు. అందుకే ఈసారి ఆంధ్రా కింగ్ తాలుకా సినిమాపై కూడా పాజిటివ్ వైబ్స్ క్రియేట్ అవుతున్నాయి. బడా హిట్స్ అందించిన మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో సినిమా కావడంతో, 'ఆంధ్ర కింగ్ తాలూకా'పై ట్రేడ్ వర్గాల్లో సైతం గట్టి బజ్ నడుస్తోంది. ఇది రొటీన్ మసాలా సినిమా కాదు, "బయోపిక్ ఆఫ్ ఎ ఫ్యాన్" (ఒక అభిమాని బయోపిక్) అనే కొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇక ఈ సినిమా ఔట్‌పుట్‌పై హీరో రామ్, నిర్మాతలు ఎంత నమ్మకంతో ఉన్నారంటే, ముందుగా ప్రకటించిన నవంబర్ 28కి బదులుగా, ఒక రోజు ముందే.. అంటే నవంబర్ 27నే సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఇప్పటికే రామ్ ఫైనల్ కాపీ చూసుకున్నాడట. ఎక్కడ బోర్ కొట్టకుండా పర్ఫెక్ట్ టైమింగ్ లో సినిమా కొనసాగుతుందట. ఇక ఈసారి హిట్టు గ్యారెంటి అనే నమ్మకంతో రామ్ ఉన్నట్లు ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. కాన్ఫిడెంట్ వచ్చాకనే అనుకున్న డేట్ కంటే ముందుగానే సినిమాను రిలీజ్ చేయాలని డిసైడ్ అయ్యారట. వాళ్లిద్దరి మధ్యలో రాజా మళ్లీ మొదటికా! ఈ నమ్మకానికి తగ్గట్టే, వివేక్ మెర్విన్ అందించిన పాటలు కూడా ఇప్పటికే చార్ట్‌బస్టర్లుగా నిలిచాయి. రామ్, మైత్రీ సంస్థల ఇంతటి నమ్మకానికి అసలు కారణం దర్శకుడు మహేష్ బాబు పి అని ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. ఆయన రాసుకున్న ఈ అభిమాని బయోపిక్ కథ, భారతీయ సినిమాలో మునుపెన్నడూ చూడని విధంగా చాలా కొత్తగా ఉందట. దర్శకుడు మహేష్ బాబు ఈ యూనిక్ పాయింట్‌ను అద్భుతంగా డీల్ చేశారని, అందుకే రామ్ ఈ ప్రాజెక్ట్‌ను అంతగా నమ్మాడని తెలుస్తోంది. గోపీచంద్ ఎగ్జిట్ తో అతడొచ్చాడా? ఈ సినిమా కేవలం రామ్ ఇమేజ్‌పైనే కాకుండా, కథనంపై బలంగా ఆధారపడి ఉంటుందని సమాచారం. "ప్రేక్షకులు ఈ సినిమాలో తమను తాము చూసుకుంటారు" అని మైత్రీ మూవీ మేకర్స్ చెబుతుండటం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ వినూత్న కథకు కన్నడ స్టార్ ఉపేంద్ర లాంటి పవర్‌ఫుల్ యాక్టర్ కీలక పాత్రలో నటించడం సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కించింది. సాంకేతికంగా కూడా ఈ సినిమాకు టాప్ టీమ్ పనిచేసింది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ దీనికి ఎడిటర్‌గా పనిచేస్తుండగా, సిద్ధార్థ నూని సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఇప్పటికే పాటలతో హైప్ తెచ్చిన టీమ్, నవంబర్ 18న కర్నూలులో భారీ ఎత్తున పబ్లిక్ ఈవెంట్ నిర్వహించి ట్రైలర్‌ను లాంచ్ చేయడానికి సిద్ధమవుతోంది. ఏదేమైనా సరికొత్త కాన్సెప్ట్ లో నెవ్వర్ బిఫోర్ అనే కాంబినేషన్ లో వస్తున్న ఆంధ్రా కింగ్ తాలుకా మంచి హైప్ క్రియేట్ చేసుకుంటోంది. ఇక నవంబర్ 27న రాబోతున్న ఈ సినిమా, ప్రేక్షకులకు ఎలాంటి కొత్త అనుభూతిని ఇస్తుందో చూడాలి.



# వాళ్లిద్దరి మధ్యలో రాజా మళ్లీ మొదటికా!

మాస్ ఇమేజ్ ఉన్న రవితేజ భర్తమహాశయులు లాంటి కాన్సెప్ట్ లో నటిస్తుండటంతో? కథలో రాజా పాత్ర ఎలా ఉంటుంది? అన్నది అందరిలోనూ ఓ సస్పెన్స్. ఈ కథను డీల్ చేస్తోన్న కిషోర్ తిరుమల సెన్సిబుల్ డైరెక్టర్. ఎలాంటి పాయింట్ అయినా సున్నితంగా అందంగా చెప్పడం అతడి ప్రత్యేకత. డిజాస్టర్ అనే సినిమా ఇంత వరకూ అతడి ఖాతాలో లేదు. భర్త మహాశయులు అనే టైటిల్ ని బట్టే ఇదో ఫ్యామిలీ ఎంటర్ టైనర్ అని తెలుస్తోంది. కానీ అందులో కిషోర్ మార్క్ తప్పని సరి అనడంలో ఎలాంటి సందేహం లేదు. దీంతో ఈ సినిమా రవితేజ మాస్ యాంగిల్ కి కాస్త దూరం జరిగి పని చేస్తున్నాడా? అన్న సందేహం అందరిలో ఉంది. ప్రభాస్ కొత్త లుక్స్.. దేనికోసం? వరుస ఫ్లాప్ ల పరంపరలో భర్తమహాశయులు ఉపశమనం ఇస్తుందనే అంచనాలు ఉన్నాయి. రిలీజ్ కు ముందు దీన్ని ఓ పాజిటివ్ సైన్ గాచెప్పొచ్చు. ఇదే పరంపరలో మరో క్లాసిక్ డైరెక్టర్ రవితేజకు జత అయ్యాడు. అతడే శివ నిర్వాణ. ఇద్దరి కాంబినేషన్ లో ఓ క్రైమ్ థ్రిల్లర్ తెరకెక్కుతుందంటూ ప్రచారం మొదలైంది. క్రైమ్ థ్రిల్లర్ అంటే రవితేజకు కొత్తేం కాదు. ఇప్పటికే ఈ జానర్ లో చాలా సినిమాలు చేసాడు. కానీ శివ నిర్వాణకు మాత్రం కొత్త ప్రయత్నమనే చెప్పాలి. హనీ రోజ్ 'రాహేలు' ట్రైలర్.. చీకట్లో ఎరుపెక్కిన కళ్ళు వెతకాలి..! ఇంత వరకూ శివ కేవలం క్లాసిక్ లవ్ స్టోరీలు మాత్రమే డీల్ చేసాడు. తన ప్రేమ కథని తెలివిగా ఎమోషన్ తో ప్రేక్షకులకు కనెక్ట్ చేసాడు. ఖుషీ సహా అదే ప్యాట్రన్ లో సాగినా డివైడ్ టాక్ తో బయట పడింది. నానితో టక్ జగదీష్ అంటూ యక్షన్ డ్రామా ప్రయత్నించాడు కానీ ఫలించలేదు. ఈ జానర్ శికు పూర్తిగా కొత్త. మరి క్రైమ్ థ్రిల్లర్లలో ఆరితేరిన రవితేజను శివ ఎంత కొత్తగా చూపిస్తాడు? అన్నది ఇప్పుడు ఆసక్తికరం. క్రైమ్ థ్రిల్లర్ జానర్లు ఆడియన్స్ కొత్తేం కాదు. సస్పెన్స్ థ్రిల్లర్స్, ఇన్విస్టిగేషన్ థ్రిల్లర్ చిత్రాలకు ఈ మధ్య కాలంలో ట్రెండింగ్ సబ్జెక్ట్ లుగా మారాయి. గోపీచంద్ ఎగ్జిట్ తో అతడొచ్చాడా? వాస్తవ సంఘటనల స్పూర్తితో కథలు అల్లి ఇంట్రెస్టింగ్ స్క్రీన్ ప్లేతో ప్రేక్షకుల్ని ఎంగేజ్ చేస్తున్నారు.క్రైమ్ జానర్లో ప్రేక్షకులకు వీలైనంత కొత్త అనుభూతిని పంచడం కోసం రైటర్స్ కం మేకర్స్ ఎంతో గ్రౌండ్ వర్క్ చేస్తున్నారు. మరి రవితేజ కోసం శివ రాసిన క్రైమ్ థ్రిల్లర్ ఎంత కొత్తగా ఉంటుంది? క్రైమ్ కథల్లో శివ ఎంత ఇన్నో వేటివ్ గా ఉన్నాడు? అన్నది చూడాలి. అలాగే క్రైమ్ థ్రిల్లర్ అంటే రవితేజ మార్క్ యాక్షన్ ఎలివేషన్ ఎలాగూ ఉంటుంది. కిషోర్ ఫ్లేవర్ నుంచి బయటకు రాగేనే రాజా వెంటనే మళ్లీ ఓల్డ్ గెటప్ లోకి ఎక్కిపోతాడు.



# సంచలన వెబ్ సిరీస్ లో తమన్నా-కాజల్!

**కానీ రిలీజ్ అయిన తర్వాత ఫలితం అన్నింటిని పటా పంచల్ చేసింది. తన కళా ఖండంతో ప్రేక్షకుల్ని ఓ సరికొత్త ప్రపంచంలో విహరించేలా చేసాడు సంజయ్.**

మనీషా కోయిరాలా, సోనాక్షి సిన్హా, అతిది రావు హైదరీ, రిచా చద్దా, షర్మిన్ సెగల్ ఇలా బాలీవుడ్ భామలందర్నీ ఒకే ఫ్రేమ్ లో హీరామండి: ది డైమండ్ బజార్ లో సంజయ్ లీలా భన్సాలీ ఎంత అందంగా..అద్భుతంగా ఆవిష్కరిం చాడో చెప్పాల్సిన పనిలేదు. తొలి భాగం సీజన్ లో ఒక్కో పాత్ర ఒక్కో ఆణిముత్యంలా హైలైట్ అయింది. అందాల తారలంతా ఆ కథలో మహారాణుల్లా అలరించారు. ఓ పాత కథని సంజయ్ చెప్పడంతో ఇప్పటి జనరేషన్ కి కనెక్ట్ అవుతుందా? లేదా? అని రిలీజ్ కు ముందు ఎన్నో సందేహాలు వ్యక్తమయ్యాయి. వాళ్లిద్దరి మధ్యలో రాజా మళ్లీ మొదటికా! సీక్వెల్ సన్నాహాల్లో సంజయ్ లీలా భన్సాలీ: కానీ రిలీజ్ అయిన తర్వాత ఫలితం అన్నింటిని పటా పంచల్ చేసింది. తన కళా ఖండంతో ప్రేక్షకుల్ని ఓ సరికొత్త ప్రపంచంలో విహరించేలా చేసాడు సంజయ్. తాజాగా ఇప్పుడీ సిరీస్ కు సీక్వెల్ కూడా ముస్తాబవుతుంది. మరికొన్ని రోజుల్లో సీక్వెల్ పట్టాలెక్కుతుందని రచయితల్లో ఒకరైన విభుపూరి తెలిపారు. ప్రస్తుతం సీక్వెల్ స్క్రిప్ట్ దశలో ఉంది. త్వరలోనే షూటింగ్ కి సంబంధించిన వివరాలు తెలియజేస్తాం అన్నారు. సీక్వెల్ లో యధావిధిగా పాత పాత్రలు కొనసాగుతాయి. అయితే వాటితో పాటు, మరికొన్ని కొత్త పాత్రలు యాడ్ కానున్నాయి. గోపీచంద్ ఎగ్జిట్ తో అతడొచ్చాడా? సౌత్ మార్కెట్ కోసమా? ఈ నేపథ్యంలో రెండు పాత్రలకు సౌత్ లో ఎంతో ఫేమస్ అయిన మిల్కీబ్యూటీ తమన్నా, చందమామ కాజల్ అగర్వాల్ ను కూడా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఆ రెండు పాత్రలు కూడా తొలి భాగం పాత్రలకు ధీటుగా మలుస్తారనే ప్రచారం జరుగుతోంది. ప్రత్యేకించి వీరిదర్నీ ఎంపిక చేసుకోవడానికి ఓ కారణం కూడా వినిపిస్తోంది. సౌత్ లో మరింతగా హీరామండి కనెక్ట్ అవ్వాలంటే కాజల్, తమన్నా లాంటి వారి సహకారం అవసరమని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మార్కెట్ పరంగా ఇద్దరు సీక్వెల్ కు ప్లస్ అవుతారు. రష్మిక 'ది గర్ల్‌ఫ్రెండ్' మేనియా.. పెరుగుతున్న వసూళ్లు! ఆ భామలకు తగ్గ నటీమణులే: ఇద్దర్నీ కూడా ఆ పాత్రలకు పర్ఫెక్ట్ ఛాయిస్ గానూ సంజయ్ భావిస్తున్నాడుట. ఇప్పటికే సౌత్ లో తమన్నా, కాజల్ అగర్వాల్ నటులుగా ఎగ్జిట్ అయ్యారు. అప్పుడప్పుడు అవకాశాలు వస్తే నటించడం తప్ప! మునుపటిలా ప్రయాణం చేయడం లేదు. ఇలాంటి తరుణంలో హీరామండి లాంటి సిరీస్ లో ఛాన్స్ అంటే గొప్ప అవకాశంగానే భావించొచ్చు. ఇలాంటి సిరీస్ లు వాళ్ల కెరీర్ కు ఎంతో దోహదం చేస్తాయి. హీరోయిన్లగా, ఐటం భామలగా కోలీవుడ్ సహా టాలీవుడ్ లోనూ సత్తా చాటారు. కాజల్ వయసు ఇప్పటికే 40 దాటగా, తమన్నా 35 క్రాస్ చేసింది. హీరామండి లో ఇప్పటికే భాగమైన వారి వయసు కూడా 35 నుంచి 40 ఏళ్లు పైబడిన వారే. వారందరికీ తమన్నా, కాజల్ సరితూగే నటులే.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com